RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 124 శనివారం 31 మే 2025 పేజీలు : 4

## ఆపరేషన్ కగార్‌లో పోలీసుల ప్రతిభ..

### ప్రభుత్వ ప్రోత్సాహకాలు..

రాయ్‌పూర్ : పోలీస్ సిబ్బందికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మావోయిస్టుల అణచివేతలో సమర్థవంతంగా పని చేసిన పోలీసులకు పదోన్నతలు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. దాదాపు 295 మందికి ఆ రాష్ట్ర పోలీస్ శాఖ పదోన్నతి కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన పదోన్నతులు జాబితాను ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్ గౌతమ్ శుక్రవారం రాయ్‌పూర్‌లో విడుదల చేశారు. రిజర్వ్ ఫోర్స్ నుంచి డీఎస్పీ వరకు అన్ని విభాగాల అధికారులకూ ఈ పదోన్నతలు కల్పించినట్లు జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేశారు. మావోయిస్టులకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నా.. బస్తర్‌లో విధులు నిర్వహించిన వారికి ఈ పదోన్నతులు కల్పించారు.




# మన శౌర్యం - ధైర్యం... ప్రపంచం చూసింది...!

## భారత్ పేరు వింటే పాక్ ఉలిక్కిపడేలా చేశాం!!

పాకిస్థాన్ సహా మొత్తం ప్రపంచం భారతదేశ కుమార్తెల సిందూర శక్తిని చూశాయని ప్రధాని మోదీ అన్నారు. బిహార్ కరకట్‌లో ప్రధాని రూ.48,520 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన శౌర్యం, ధైర్యాన్ని ప్రపంచం చూసిందని మోదీ చెప్పారు. మాతృభూమికి సేవ చేయడమనే పవిత్ర కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, మే 10న సరిహద్దులో బీఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ తన ప్రాణాలను అర్పించారని మోదీ కొనియాడారు. ఈ బిహార్ కుమారునికి గౌరవపూర్వక నివాళి అర్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్ శక్తిని శత్రువు చూశాడు. భారత్ పేరు వింటే ఉలిక్కిపడేలా చేశామని, ఇది మన అంబులపొదిలో ఉన్న ఒక బాణం మాత్రమే అని వారు అర్థం చేసుకోవాలి. ఉగ్రవాదంపై భారతదేశం చేస్తున్న పోరాటం ఆగలేదు. ఉగ్రవాదం మళ్లీ తలెత్తితే, అది ఏ కలుగులో దాక్కున్నా.. భారతదేశం బయటకు లాగి అణచివేస్తుంది" అని ప్రధాని అన్నారు.

**మావోయిస్ట్ హింస పూర్తిగా నిర్మూలిస్తాం...** గడిచిన సంవత్సరాల్లో హింస, అశాంతిని వ్యాప్తి చేసే వారిని మనం ఎలా నిర్మూలించామన్న దానికి బిహార్ ప్రజలే ప్రత్యక్ష సాక్షులని ప్రధాని మోదీ అన్నారు. 'కొన్నేళ్ల క్రితం ససారాం, దాని సమీప జిల్లాల్లో నక్సలిజం ఎంత ప్రబలంగా ఉండేదన్న విషయాన్ని మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. మావోలకు బాబాసాహెబ్ అంబేద్కర్‌పై నమ్మకం లేదు. అటువంటి సంక్లిష్ట పరిస్థితులలో కూడా, సీఎం నితీష్ కుమార్ ఇక్కడ అభివృద్ధి కోసం తన వంతు ప్రయత్నం చేశారు. 2014కి ముందు 75కి పైగా జిల్లాలు నక్సల్ ప్రభావితమైనవి. ఇప్పుడు వాటి సంఖ్య కేవలం 18 జిల్లాలకు మాత్రమే పరిమితమైంది. మావోయిస్టు హింస పూర్తిగా నిర్మూలించబడే రోజు ఎంతో దూరంలో లేదు" అని మోదీ అన్నారు.

## బీహార్‌లో రూ.48,520 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శ్రీకారం

**కరకట్‌లో రూ.48,520 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ...** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ (శుక్రవారం) బిహార్‌లోని కరకట్‌లో రూ.48,520 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. నిన్న బిహార్ కు రెండ్రోజుల పర్యటన నిమిత్తం విచ్చేసిన ప్రధాని మోదీ.. ఇవాళ NH-22లోని పట్నా%-%గయా-దోభి సెక్షన్‌ను నాలుగు లేన్లుగా మార్చడం, NH-27లోని గోపాల్‌గంజ్ టౌన్‌లో దాదాపు రూ.5,520 కోట్ల విలువైన ఎలివేటెడ్ హైవే.. గ్రేడ్ మెరుగుదలను మోదీ ప్రారంభించారు. వీటితోపాటు, సోన్ నగర్-మహ్మద్ గంజ్ మధ్య రూ.1,330 కోట్లతో నిర్మించిన మూడో రైలు మార్గాన్ని జాతికి అంకితం చేశారు. బిహార్, ఇంకా తూర్పు భారతదేశానికి ఇంధన భద్రతను చేకూర్చే లక్ష్యంతో ఔరంగాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన రూ.29,930 కోట్లకు పైగా విలువైన నబీనగర్ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ స్టేజ్-II (3x800 MW)కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఇంకా, ఈ ప్రాంతంలో రోడ్డు మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీని బలోపేతం చేస్తూ, ప్రధానమంత్రి వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

వీటిలో NH-119Aలోని పాట్నా-అర్రా-ససారాం సెక్షన్‌ను నాలుగు లేన్లుగా విస్తరించడం, వారణాసి-రాంచీ-కోల్‌కతా హైవే, రాంనగర్-కచ్చి దర్గా స్ట్రెచ్‌ను ఆరు లేన్లుగా విస్తరించడం.. బక్సర్, భరౌలి మధ్య గంగా నదిపై కొత్త వంతెన నిర్మాణం ఉన్నాయి.




## ఐఎన్ఎస్ విక్రాంత్ పైనుంచి

## పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ వార్నింగ్

పాకిస్థాన్‌కు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాకిస్థాన్‌తో యుద్ధం జరిగినప్పుడు భారత నేవీ కనుక రంగలోకి దిగి ఉంటే.. పాకిస్థాన్ నాలుగు ముక్కలై ఉండేదని అన్నారు. యుద్ధం సమయంలో భారత నేవీ మౌనంగా ఉంటూనే.. శత్రువుల గుండెల్లో దడ పుట్టించిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నేవీ పాత్రను ఆయన కొనియాడారు. రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను సందర్శించారు. ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నిలబడి పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ' 1971లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరిగినప్పుడు భారత నేవీ కూడా యుద్ధంలో పాల్గొంది. భారత నేవీ దెబ్బకు పాక్ రెండుగా చీలిపోయింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నేవీ రంగంలోకి దిగి ఉంటే.. ఈసారి పాక్ నాలుగు ముక్కలు అయ్యేది. ఆపరేషన్ సిందూర్ సమయంలో నేవీ మౌనంగా తన పని చేసుకుపోయింది. ప్రతీ భారతీయుడ్ని ఆశ్చర్యపరిచింది. మౌనంగా ఉంటూనే .. పాక్ ఆర్మీని ఓడించటంలో విజయవంతం అయింది. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్ పాక్ టెర్రర్ బేస్‌లను ధ్వంసం చేసింది. అప్పుడు భారత నేవీ బలగాలు ఎంతో దూకుడుగా అరేబియా మహా సముద్రంలో మోహరించాయి.

పాక్ నేవీ.. నీటి సరిహద్దులు దాటి ఇటువైపు రావడానికి ధైర్యం చేయలేకపోయింది. పాకిస్థాన్ చాలా అదృష్టం చేసుకుంది. ఒకవేళ ఆపరేషన్ సిందూర్ సమయంలో నేవీ రంగంలోకి దిగి ఉంటే పాక్ పరిస్థితి దారుణంగా ఉండేది. ఇప్పటి వరకూ జరిగిందంతా వామ్ అప్ మాత్రమే. ఈసారి పాకిస్థాన్ యుద్ధానికి దిగితే.. నేవీ కూడా రంగంలోకి దిగుతుంది. అప్పుడు పాక్ పరిస్థితి ఏమవుతుందో ఆ దేవుడికే తెలియాలి' అని అన్నారు.

## బీఆర్ఎస్ నిఘా నీడలో కవిత పర్యటన

మంచిర్యాల, మే 30: జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటనపై బీఆర్ఎస్ అధిష్టానం పూర్తిస్థాయిలో నిఘా పెట్టింది. పార్టీకి సంబంధించి నేతలు ఎవరెవరు వెళ్తున్నారనే దానిపై ఆరా తీసింది. సొంత మీడియా ప్రతినిధులతో పర్యటన మొత్తాన్ని చిత్రీకరించాలని ఆదేశించింది. న్యూస్ అవసరం లేదని.. కవిత వెంట ఎవరెవరు ఉన్నారో వివరాలు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే పార్టీకి సంబంధించి నాయకులు ఎవరూ కూడా కవిత పర్యటనకు హాజరుకాకుండా ఆమెకు పెద్ద షాకిచ్చారు. కవిత టీజీబీకే అధ్యక్ష హోదాలో ఉన్న సమయంలో ఆమె వెంట తిరిగిన వందలాది మంది కార్మిక నేతలు, బీఆర్ఎస్ నేతలు ఎవరూ కూడా కవిత పర్యటనవైపు కన్నెత్తి చూడని పరిస్థితి. మర్యాదపూర్వంగానూ నేతలు మొహం చూపలేదు. కేవలం దాసరి ఉష మాత్రమే కాసేపు వచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కవిత పర్యటనకు దూరంగా ఉన్నారు. కేవలం జాగృతి కార్యకర్తలతో కలిసి మాత్రమే జిల్లాలో ఎమ్మెల్సీ పర్యటించారు. దీన్ని బట్టి బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు వెళితే ఆమె వెంట ఎవరూ వెళ్లరన్న సంకేతం వెలువడినట్లైంది. అంతేకాకుండా మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పార్టీలో పరిణామాలు, తనకు జరిగిన అవమానాల గురించి చెప్పుకొచ్చారు కవిత. గత పదేళ్లుగా క్షోభను అనుభవిస్తున్నానని తెలిపారు. ఆ తరువాత మీడియా ముందుకు వచ్చిన సమయంలో బీఆర్ఎస్ పార్టీ ప్రస్తావన లేకుండానే ముగించేశారు. మీడియాతో ఆచితూచీ మాట్లాడారు ఎమ్మెల్సీ. కేవలం ఆపరేషన్ కగార్ గురించి మీడియాతో మాట్లాడుతూ... ఈ ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఆపరేషన్ కగార్‌ను తప్పు బట్టడంతో పాటు నంబాల కేశవరావు వంటి మావోయిస్టు నేతల మృతదేహాలను ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అలాగే సరస్వతీ పుష్కరాల్లో స్థానిక ఎంపీ వంశీని అవమానించారని... దీంతో కాంగ్రెస్ పార్టీలో దళిత వ్యతిరేకత బయట పడిందన్నారు. తనను కూడా పుష్కరాలకు ఆహ్వానించలేదని.. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు. దళితుడు కాబట్టే డిప్యూటీ సీఎంను యాదాద్రిలో కింద కూర్చొబెట్టారని పేర్కొన్నారు. కేవలం రెండు నిమిషాల్లోనే ఎమ్మెల్సీ కవిత తన మీడియా సమావేశాన్ని ముగించేశారు.




## ఎట్టకేలకు తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు

# ముహూర్తం ఫిక్స్..?

## రాములమ్మకు బంపర్ ఆఫర్..!?

హైదరాబాద్ : తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడి మరో ఆరు నెలలు పూర్తైయితే రెండేళ్లు పూర్తి చేసుకోబోతుంది. కానీ ఇప్పటి వరకు తెలంగాణలో పూర్తి స్థాయి మంత్రివర్గ విస్తరణ జరగలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలకే లోకసభ సార్వత్రిక ఎన్నికలు రావడంతో అప్పటి వరకు క్యాబినేట్ విస్తరణకు బ్రేక్ వేసారు. లోక్ సభ ఫలితాల తర్వాత రేపు మాపు అంటూ యేడాది వరకు లాక్కొచ్చారు. ముందుగా సంక్రాంతి తర్వాత.. ఆపై ఉగాది.. ఏప్రిల్ ఫస్ట్ వీక్ లో విస్తరణలో ఉంటుందంటూ రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ వెళ్లినపుడల్లా మీడియాలో పుంఖాను పుంఖానులుగా కథనాలు వెలుబడ్డాయి. క్యాబినేట్ విస్తరణ ఆలస్యం కావడానికి అసలు కారణాలు తెలియరావడం లేదు. విస్తరణలో అధిష్టానం ఆలోచన ఒకలా ఉంటే సీఎం రేవంత్ రెడ్డి,రాష్ట్ర నేతల అభిప్రాయాలు మరోలా ఉన్నాయనే టాక్ వినిపించింది. మధ్యలో తెలంగాణ క్యాబినేట్ విస్తరణలో ఆయా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఛాన్స్ అంటూ వార్తలు వచ్చాయి. దీంతో కొంత మంది అధిష్ఠానం దగ్గర ఆయా నేతల గురించి చెప్పడంతో మంత్రి వర్గ విస్తరణకు బ్రేకులు పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు తెలంగాణలో క్యాబినెట్ విస్తరణకు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. క్యాబినెట్‌లోకి SC, ST, BC, OCల నుంచి ఒకరు చొప్పున కొత్తగా నలుగురికి రాష్ట్ర క్యాబినెట్‌లో చోటివ్వనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఏడుగురి పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై మొన్న రాహుల్ గాంధీతో కేసీ వేణుగోపాల్, మహేష్‌కుమార్‌గౌడ్ చర్చించారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గాన్ని నిన్న ఖరారు చేయాల్సి ఉండగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో వాయిదా పడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెలంగాణ క్యాబినెట్ లో రేవంత్ రెడ్డితో కలుపుకొని 18 మంది ఛాన్స్ ఉంది. ఇపుడు రేవంత్ క్యాబినేట్ లో 12 మంది మంత్రులుగా ఉన్నారు. అందులో 6 పదవులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఆరు పదవులను భర్తీ చేయడానికి అనేక అంశాలను పరిగణలోకి తీసుకొని మంత్రివర్గ కూర్పు ఉండబోతున్నట్టు తెలుస్తుంది. అందులో వివిధ సామాజిక వర్గాలు.. సీనియారిటీ, జిల్లాల ప్రాతిపదికన ఎంపిక చేయనున్నట్టు తెలుస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కొంత మందికి పార్టీలో చేరే సందర్భంగా మంత్రి వర్గంలో చోటు కల్పిస్తామని హామి ఇచ్చాయి. ఆ హామి కాంగ్రెస్ కు పెద్ద తలనొప్పిగా పరిణమించింది. ఇందులో రాజగోపాల్ రెడ్డితో పాటు వివేక్ వెంకట స్వామి వంటి వారున్నారు. మరోవైపు మంత్రివర్గంలో ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఇప్పటి వరకు కేబినెట్ లో చోటు లేదు. దీంతో ఈ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు ఛాన్స్ ఇవ్వాలనే డిమాండ్ వినబడుతుంది. మొత్తంగా ఈ సారి క్యాబినేట్ విస్తరణలో నలుగురు కొత్తవాళ్లకు ఛాన్స్ ఇవ్వనున్నట్టు తెలుస్తుంది. మరో రెండు పదవులను అట్టే పెట్టనున్నారు. నలుగురా.. ఆరుగురికి ఇస్తారా అనేది చూడాలి. ఈ నేపథ్యంలో రీసెంట్ గా ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయశాంతికి హోమ్ మినిస్టర్ పదవి ఇస్తారంటూ జోరుగా చర్చ జరుగుతోంది. గతంలో వైఎస్ హయాంలో మహిళకు హోంమినిస్టర్ పదవి ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు కూడా అదే విధంగా మహిళను హోంమినిస్టర్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి కీలక పదవి అప్పగిస్తారని టాక్ వినిపిస్తోంది. ఖాళీగా ఉన్న పోర్ట్ ఫోలియోలను కొత్తవారితో భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత పూర్తి స్థాయిలో మంత్రివర్గం కొలువుదీరే అవకాశాలున్నాయి. ఇవన్నీ ఊహాగానాలా లేకపోతే నిజంగానే మంత్రివర్గ విస్తరణను పూర్తి చేస్తారా అనేది వెయిట్ అండ్ సీ.

## సంపాదకీయం

# బీజేపీ తిరంగా వర్సెస్ కాంగ్రెస్ జై హింద్!

దేశం కోసం సైనికులు యుద్ధం చేశారు. వారి దేశ భక్తిని కీర్తించడానికి మాటలు అయితే చాలవు. సరిహద్దులలో నిరంతరం పహారా కాస్తూ కళ్ళలో ఒత్తులేసుకుని శత్రువుని కనిపెడుతూ అవసరం అయిన సందర్భంలో దేశం కోసం తమ ప్రాణాలను తృణ ప్రాయంగా త్యజించే వారి సేవలు ఎనలేనివి. పహిల్గాం దాడితో భారతదేశం మొత్తం మండిపోయింది. కులం మతం, ప్రాంతం వర్గం, వర్ణం అన్న తేడా లేకుండా అంతా ఒక్కటిగా నిలిచి పాకిస్థాన్ భరతం పట్టాలని గట్టిగా కోరుకున్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం చేసిన వైమానిక దాడులతో పాక్ విలవిలలాడింది. ఉగ్ర శిబిరాలు ఒక్క దెబ్బకు నేల కూలాయి. భారతీయుల కళ్ళలో ఆనందం మెరిసింది. ఇదే ఊపుతో పాక్ ని ప్రపంచ పటం లో లేకుండా చేయాలని అంతా గట్టిగా కోరుకున్నారు. ఇక ఉగ్ర వాదం అన్న పదం వినిపించకూడదని కూడా భావించారు. కానీ నాలుగు రోజుల పాటు జరిగిన దాడుల తరువాత యుద్ధం ఆగిపోయింది కాల్పుల విరమణను అటూ ఇటూ పాటించారు. ఇది దేశంలోని పౌరులందరి ఆశల మీద ఆవేశం మీద నీళ్ళు చల్లినట్లు అయింది దాంతో అంతా ఒక్కసారిగా చప్పబడ్డారు. ఇదే సమయంలో భారత జవాన్ల పౌరుషాన్ని వారి విజయాన్ని జాతి జనులకు చెబుతామని బీజేపీ ఈ నెల 13 నుంచి 24 వరకూ భారీ ఎత్తున దేశవ్యాప్తంగా తిరంగా యాత్రను చేపట్టింది. ఈ యాత్రలో ఎటు చూసినా బీజేపీ జెండాలతో పాటు రాజకీయ పరంగా సాగడంతో కాంగ్రెస్ సహా విపక్షాలు దాని మీద విమర్శలు ఎక్కుపెట్టారు. సైనికుల త్యాగాలను రాజకీయం చేస్తున్నారు అని కూడా మండిపడ్డాయి. ఇక బీజేపీ మాత్రం జాతీయ స్థాయి నుంచి రాష్ట్ర జిల్లా గ్రామ స్థాయి దాకా తిరంగా యాత్రను చేపట్టింది. అలా కాషాయ దళం దేశ భక్తిని తమ సొత్తు అని చెప్పుకుందని విమర్శలు వినిపించాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ కూడా జైహింద్ పేరుతో రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ జైహింద్ పేరిట ర్యాలీలు నిర్వహిస్తోంది. ఈ ర్యాలీలలో దేశం కోసం త్యాగాలు చేసిన సైనికులను కొనియాడుతూనే వారి విజయాలను రాజకీయం చేస్తున్న బీజేపీని గట్టిగానే విమర్శిస్తోంది. అసలు యుద్ధం ఎందుకు ఆపారని బీజేపీ పెద్దలను కాంగ్రెస్ నేతలు నిలదీస్తున్నారు. ట్రంప్ చెబితే యుద్ధం ఆపేస్తారా అన్నారు తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి. పాక్ ని ప్రపంచ పటంలో కనిపించకుండా చేయాలని దేశ ప్రజలు కోరుకుంటే యుద్ధం లేకుండా కాల్పుల విరమణను ఎవరు పాటించమన్నారు అని ఆయన నిలదీశారు. పాకిస్థాన్ మీద యుద్ధం చేయకుండా నిలుపుదల చేయడం వెనక అమెరికా పాత్ర ఎందుకు అని ఆయన అంటున్నారు. గతంలో ఇందిరాగాంధీ యుద్ధం చేసి మరీ పాక్ ని నడ్డి విరగ్గొట్టి రెండుగా చేశారు అని ఆయన గుర్తు చేశారు. ఆనాడు అమెరికా మాటను ఇందిరా గాంధీ వినలేదని కూడా ఆయన చెప్పుకొచ్చారు. మొత్తానికి మోడీ మీద రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలే చేశారు. ఆయనే కాదు కాంగ్రెస్ నాయకులు దేశమంత జైహింద్ అంటూనే బీజేపీ మీద విమర్శలు ఎక్కుపెడుతున్నారు. మొత్తానికి చూస్తే సరిహద్దులలో యుద్ధం అయితే ఆగింది. కానీ దేశంలో రాజకీయ యుద్ధం స్టార్ట్ అయింది. దేశం కోసం పోరాటం దేశ రక్షణ అన్ని చాలా భావోద్వేగాన్ని కలిగించేవి. వాటిని రాజకీయంగా బీజేపీ వాడుకుంటోంది అని కాంగ్రెస్ అంటే కాంగ్రెస్ కూడా జైహింద్ పేరుతో అదే చేస్తోంది అన్నది బీజేపీ నేతల ప్రతి విమర్శ. మొత్తానికి పాక్ భారత్ మధ్య కాల్పుల విరమణ జరిగింది. దేశంలో ర్యాలీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. మరి జనాలు ఏమనుకుంటున్నారు అన్నదే ఇపుడు చాలా ముఖ్యం.

# కన్నుల పండువగ శ్రీ మార్కండేయ విగ్రహ ప్రతిష్ట, శివపార్వతుల కళ్యాణ మహోత్సవం...

### ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటెల, బుద్ది శ్రీనివాస్, శామీర్పేట సిఐ శ్రీనాథ్, శామీర్పేట మండల్ మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్ కుమార్, ఎంపీటీసీ అశోక్.

### శివపార్వతుల కళ్యాణంలో పాల్గొన్న ఉత్సవ విగ్రహ దాత కాంగ్రెస్ నాయకులు, అలియాబాద్ మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి...

### మార్కండేయ దేవాలయ కమిటీ సభ్యులను అభినందిస్తున్న నాయకులు, భక్తులు....









శామీర్ పేట, (గరుడ వార్త) : అంగరంగ వైభోగంగా శ్రీ మార్కండేయ సైత శివపంచాయతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తుల సహకారంతో మార్కండేయ దేవాలయ కమిటీ సభ్యులు కన్నుల పండుగగా నిర్వహించారు. అలియాబాద్ పట్టణంలోని నూతనంగా నిర్మించిన శ్రీ మార్కండేయ ఆలయంలో బుధవారం ప్రారంభమైన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం రోజున వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య సంపూర్ణమైంది.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ అనంతరం శివపార్వతుల కళ్యాణాన్ని కూడా నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణం లో సతీ సమేతంగా కాంగ్రెస్ నాయకులు అలియాబాద్ మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున దర్శించుకొని మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బొమ్మ లింగమయ్య, బొమ్మ కుమార్, బొమ్మ శ్రీ వారి కుటుంబ సభ్యులు కళ్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు. ప్రతిష్టాపన మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన అలియాబాద్ పద్మశాలి సంఘంతో పాటు శ్రీ మార్కండేయ సహిత శివ పంచాయతన ఆలయ కమిటీ అధ్యక్షులు పడిగా రవి, ఉపాధ్యక్షులు వంగరి శ్రీనివాస్, కార్యదర్శి సామల నరసింహ, కోశాధికారి హనుమాన్ల విజయ్ కుమార్ల కృషి పై భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ కమీషనర్ ను సన్మానించిన అలియాబాద్ పట్టణ నాయకులు...

### బండి రాంరెడ్డి, ముద్దపురం క్రిష్ణగౌడ్, గాదె వెంకటేశ్ తదితరులు...



శామీర్ పేట, (గరుడ వార్త) : అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ చంద్రశేఖర్ ను నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శామీర్ పేట మండల అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ గా చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టిన విషయం పాఠకులకు విదితమే. అందులో భాగంగా భాగంగా అలియాబాద్ పట్టణ నాయకులు కమిషనర్ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరి సహకారంతో అలియాబాద్ మున్సిపల్ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి రాంరెడ్డి, ముద్దపురం క్రిష్ణగౌడ్, గాదె వెంకటేశ్, శ్రీకర్ రెడ్డి, కిరణ్ రెడ్డి, వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ మహారాజ్‌ను దర్శించుకున్న మల్కాజ్గిరి ఎంపీ ఈటెల



శామీర్ పేట, (గరుడ వార్త) : సేవాలాల్ మహారాజ్ ఆలయంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. శామీర్ పేట మండలం పరిధిలోని సేవాలాల్ మహారాజ్ 3వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఈటెల రాజేందర్ పాల్గొని సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాతాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మల్లన్న కాలనీవాసులు జగదాంబ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నది నుంచి నల్లా దాకా..!

చౌటుప్పల్: ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 35 లక్షల మందికి కృష్ణా, గోదావరి నదుల నీళ్లు మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లాల్లో సరఫరా అవుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఈ నదీ జలాలను శుద్ధి చేసి నల్లాలతో అందిస్తున్నారు. నది నుంచి సేకరించిన నీళ్లను జిల్లాలోని స్వాములవారి లింగోటం, పానగల్లులలో ప్రత్యేకంగా నెలకొల్పిన ప్లాంట్లలో నాలుగు దశల్లో శుద్ధి చేస్తారు. శుద్ధీకరణ పూర్తయ్యాక ఆ నీళ్లకు పరీక్షలు నిర్వహిస్తారు. పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాల ప్రకారం శుద్ధీకరణ పూర్తయిందని నిర్ధరించుకున్నాక.. ట్యాంకుల్లోకి ఎక్కించి గ్రామాలకు సరఫరా చేస్తారు. గ్రామ పంచాయతీల్లోని నల్లాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల పరిధిలో 1197 గ్రామాలకు సరఫరా అవుతున్న నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియను మిషన్ భగీరథ పథకం(గ్రిడ్) చౌటుప్పల్ ఈఈ లక్ష్మీనారాయణ వివరించారు.

మొదటి దశ.. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్) నుంచి కృష్ణా నీటిని నాంపల్లి మండలం స్వాములవారి లింగోటంలోని నీటి



శుద్ధి కేంద్రానికి పంపిస్తారు. ఈ ప్లాంటులో పైపుల ద్వారా నీరు ప్రవహిస్తున్నప్పుడే ప్రీ క్లోరినేషన్ చేసి నీళ్లలో ఏవైనా బ్యాక్టీరియాలు ఉంటే నశింపజేస్తారు. తర్వాత ఏవియేటర్‌లోని నీళ్లను పంపిస్తారు. అక్కడ నీటిని చిలుకుతారు. ఆ ప్రక్రియతో నీటిలోకి ఆక్సీకరణ చేస్తారు. టర్బిడిటీని తొలగిస్తారు.

రెండో దశ.. తొలి దశలో శుద్ధి అయిన లక్ష లీటర్ల నీళ్లకు రెండు గ్రాములు చొప్పున స్పటికాలతో కూడిన ఆలం కలుపుతారు. క్లారి ఫ్లోక్యులేటర్ ద్వారా ఈ నీటిని పంపించి శుద్ధి చేస్తారు.

మూడో దశ.. రెండు దశల్లో శుద్ధి చేసిన నీటిని ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్లలోకి పంపిస్తారు. రెండు మీటర్ల ఎత్తుండే ఈ ఫిల్టర్‌లో నాలుగు పొరలుగా గులకరాళ్లు, ఇసుక పేర్చి ఉంటుంది. వీటి ద్వారా వడగట్టిన నీటి టర్బిడిటీ 0-1 ఎన్‌టీయూకు తగ్గుతుంది. నాలుగో దశ.. మూడు దశల్లో శుద్ధి అయిన నీళకు పోస్ట్ క్లోరినేషన్ చేసి సంప్‌లోకి చేరుస్తారు. నాలుగో దశ శుద్ధి తర్వాత ఈ నీళ్లు స్వచ్ఛంగా, తేటగా, రుచిగా, శరీరానికి అవసరమైన అన్ని రకాల పోషకాలతో కూడి ఉంటాయి. శుద్ధి అయిన నీటిని ఉపరితల రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి భూమ్యాకర్షణ ద్వారా గ్రామాల్లోని శుభ్రం చేసి క్లోరినేషన్ చేసి ఉన్న ఉపరితల ట్యాంకుల్లో నింపుతారు. అక్కడి నుంచి ఇళ్లలోని నల్లాల ద్వారా ప్రజలకు సరఫరా జరుగుతుంది. పూర్తిస్థాయిలో శుద్ధీకరణ జరిగి, తగినన్ని పోషకాలున్న మిషన్ భగీరథ నీళ్లను ఎలాంటి అనుమాల్లేకుండా తాగవచ్చు.

# కన్నేసి..కాజేసి

కోదాడ : అర్బన్ ప్రాంతాలలోని భూముల ధరలకు గిరాకీ అంతా ఇంతా కాదు. అందులోనూ రహదారికి ఆనుకొని ఉండే భూమికి రూ.కోట్ల వర్షమే కురుస్తుంది. ఇలాంటి భూములపై కన్నేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ల అభివృద్ధి పేరుతో వరద కాలువలను సైతం కలిపేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రతి రహదారికి ఇరువైపులా వరద కాలువలను నిర్మాణ దశలోనే ఏర్పాటు చేస్తుంది. హఠాత్తుగా భారీ వర్షాలు వచ్చినా ఈ కాలువల ద్వారా నీళ్లు ప్రవహిస్తుంది. గతేడాది భారీ వర్షాల కారణంగా రహదారులకు ఇరువైపులా కాలువలు లేక వరదలు సంభవించాయి. కోదాడ పట్టణంలో వరదల ధాటికి ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడగా, మండలంలో వేల ఎకరాల పంట కొట్టుకుపోయింది. అయినా అధికారులకు పట్టింపు లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నుంచి మేళ్లచెరువు ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా వరద కాలువ కనుమరుగైంది. ఈ ప్రాంతంలో ఎకరం భూమి రూ.కోటి నుంచి రూ. 1.5 కోట్ల వరకు ధర పలుకుతుంది. రియల్ వ్యాపారులే కాక కొందరు రైతులు సైతం కాలువను ఆక్రమించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చర్యలు తీసుకుంటాం- సూర్యనారాయణ, ఆర్డీవో కోదాడవరద కాలువలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. రహదారులకు ఇరువైపులా వరద కాలువలు తప్పనిసరిగా ఉండాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా వెంచర్ల యజమానులు నిబంధనలు పాటించాలి.

# తవ్వేకొద్దీ అక్రమాలు!

పాల్వంచ : పాల్వంచకు అతి సమీపంలోని ముర్రేడు, కిన్నెరసాని నదుల నుంచి ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. పాల్వంచ పట్టణంలోని కుంటినాగులగూడెం, శ్రీనివాసకాలనీ, మంచికంటినగర్, శివనగర్, విద్యుత్ ఎంప్లారస్ కాలనీ, కేఎల్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతం, బసవతారకకాలనీ, జగన్నాథపురం, లక్ష్మీదేవిపల్లిలో వందలాది సంఖ్యలో నూతన భవనాలు, వ్యాపార సముదాయాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.కొందరు బిల్డర్లు, భవన నిర్మాణ యజమానులు.. తోగ్గూడెం సమీపంలోని ముర్రేడు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఒడ్డుకు ఇసుకను రాత్రిపూట డంప్ చేసి లారీల్లో పాల్వంచకు తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంగం, రంగాపురం, నాగారం వద్ద కిన్నెరసాని నది, పాత పాల్వంచలో ముర్రేడు నది నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

**పట్టించుకోని యంత్రాంగం**

తోగ్గూడెం కేంద్రంగా ఇసుక డంప్ చేసి అక్రమంగా తరలిస్తున్నా పోలీసు, రెవెన్యూ, మైనింగ్, అటవీశాఖ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా ఒకట్రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నదుల నుంచి ఇసుకను టన్నుల కొద్దీ తరలించటం వల్ల భూగర్భజలాలు ఇంకిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, అటవీ, చెక్‌పోస్ట్ అధికారులు పకడ్బందీగా తనిఖీలు చేపడుతూ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పోలీసు, మైనింగ్ అధికారుల సహకారంతో అక్రమ మైనింగ్‌పై ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం. ఇసుక అక్రమ రవాణాపై తరచూ కేసులు నమోదుచేస్తున్నాం. స్వాధీనపరచుకున్న ఇసుకకు పలుమార్లు బహిరంగ వేలం నిర్వహించాం. వివేక్, తహసీల్దారు, పాల్వంచ

# చకచకా.. ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్ : పేదల సొంతింటి కల నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పరుగులు తీస్తోంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు కొన్ని గృహాలైన ప్రారంభించేందుకు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. లబ్ధిదారుల్లో కొందరు ఖాళీ స్థలంలో ఇల్లు కట్టుకుంటుండగా, మరికొందరు తాత్కాలిక నిర్మాణాలను తొలగించి నిర్మాణం చేపడుతున్నారు.

**జీహెచ్ఎంసీ మినహాయించి..**

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని జీహెచ్ఎంసీ పరిధిలోకి వెళ్లే నియోజకవర్గాలు, డివిజన్లను మినహాయించి మిగిలిన ప్రాంతాల్లోని లబ్ధిదారులను మాత్రమే అధికారులు ఎంపిక చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఎల్బీనగర్,



శేరిలింగంపల్లి నియోజకవర్గాలు, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో రెండు మండలాలు, మేడ్చల్ జిల్లాలో కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు ఇందులో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో ఇళ్ల నిర్మాణం తొలుత మందకొడిగా ప్రారంభమైనా ఏప్రిల్ చివరివారం నుంచి వేగం పుంజుకొంది. మేడ్చల్ నియోజకవర్గంలో తొలుత 4,800 ఇళ్లు నిర్మించాలని భావించగా, 3500 ఇళ్లకు ప్రణాళికలు రూపొందించారు. ముందుకు వచ్చిన 1028 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు.

**600 చదరపు అడుగుల్లో...** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 400 చదరపు అడుగుల్లో మాత్రమే ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఆదేశాలు జారీచేసింది. నమూనా ఇంటిని పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు మరింత విశాలంగా ఉండేలా చూడాలంటూ ఆదేశించారు. దీంతో 600 చదరపు అడుగుల్లో ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించారు.

# మార్గం సుగమం.. టెండర్ల ఖరారులో జాప్యం

హైదరాబాద్ : సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి డైయిరీఫాం వరకు 5.4 కిలోమీటర్ల మేర నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ టెండర్ల ఖరారులో జాప్యం జరుగుతోంది. వాస్తవానికి ఈనెల 15తో గడువు ముగిసినప్పటికీ టెండర్లను తెరవడంపై అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోవడం లేదు. ఇ-ప్రొక్యూర్ విధానంలో టెండర్లు పిలిచారు. గడువు ముగిసిన దరిమిలా తొలుత సాంకేతికత బిడ్లు పరిశీలించాలి. ఇందులో అర్హత సాధించిన సంస్థల ఫ్రైస్ బిడ్‌లను తెరుస్తారు. ఇప్పటికే పనులకు శంకుస్థాపన చేసి ఏడాది గడిచింది. ప్యారడైజ్ నుంచి సికింద్రాబాద్, తాడ్‌బండ్, బోయిన్‌పల్లి మీదుగా డెయిరీఫాం వరకు ఈ కారిడార్ నిర్మించనున్నారు. ప్రాజెక్టుకు రూ.652 కోట్లు, భూసేకరణతో కలిపి మొత్తం రూ.1,550 కోట్లు ఖర్చు చేస్తారు. పూర్తయితే 44వ జాతీయ మార్గంలో మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్ వైపు వాహనాల రాకపోకలు ఎంతో సులువు కానున్నాయి. ట్రాఫిక్ సమస్య లేకుండా నగరం నుంచి త్వరగా బయటకు వెళ్లే మార్గం దొరకనుంది. కారిడార్‌లో భాగంగా బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద 600 మీటర్ల భూగర్భ టన్నెల్‌ను నిర్మిస్తారు.

**శామీర్‌పేట మార్గంలోనూ..**

నగరం నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాలకు రవాణా సాఫీగా సాగేందుకు సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఔటర్‌రింగ్ రోడ్డు వరకు (18.10 కిలోమీటర్లు) నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి ఇంకా టెండర్ల ప్రక్రియనే మొదలు కాలేదు. రక్షణశాఖ భూముల బదలాయింపు కొలిక్కి రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 197 ఎకరాల భూసేకరణకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో 113.48 ఎకరాలు రక్షణశాఖ నుంచి సేకరించాల్సి ఉంది. అనంతరం అంతే విలువైన భూమిని మరోచోట ప్రభుత్వం కేటాయించాలి. ఇందుకోసం ఇప్పటికే హెచ్ఎండీఏ పలు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి రక్షణశాఖకు నివేదించింది. అంతేకాక రక్షణ శాఖ భూముల్లో ఒకచోట 5 లక్షల, మరోచోట 2.5 లక్షల గ్యాలన్ల తాగునీటి రిజర్వాయర్లున్నాయి. ఆ శాఖకు చెందిన కొన్ని భవనాలనూ తొలగించాలి. బదులుగా వేరేచోట రిజర్వాయర్లు, భవనాలు నిర్మించి అప్పగించాలి. ఈ ప్రక్రియ పూర్తయితేనే ఆ శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది. ఈ కారిడార్‌కు మొత్తం రూ.3,619 కోట్లు వెచ్చించనున్నారు.

# కార్డులు కొరత.. వివరాల్లేక వెత!

వికారాబాద్ : మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ-మదర్ చైల్డ్ ప్రొటెక్షన్) కార్డులతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. అయితే వీటికి జిల్లాలో కొరత ఏర్పడింది. మాతా, శిశు మరణాల నివారణలో భాగంగా ప్రభుత్వం వీటిని ప్రవేశపెట్టింది. ఇందులో గర్భిణుల పూర్తి వివరాలు, అధార్ కార్డు నంబరు, వారి ఆరోగ్య సమస్యలు, గతంలోనే ప్రసవిస్తే ఆ వివరాలు, గర్భస్థ శిశు వివరాలు, బరువు, ప్రస్తుతం అందిస్తున్న వైద్యం, ముమ్మందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు/చికిత్స తదితరాలను నమోదు చేస్తారు. అంతేకాకుండా హిమోగ్లోబిన్ శాతం, బీపీ, మూత్ర పరీక్షలు, అంగన్‌వాడీ ద్వారా తీసుకుంటున్న పౌష్టికాహారం, శిశువు జన్మించిన అయిదేళ్ల వరకు ఇవ్వాల్సిన టీకాలతో పాటు ఇతర వివరాలు కార్డులో పొందుపరుస్తారు. మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు గర్భిణి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనంతరం తల్లీ బిడ్డలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించిన వైద్యం వివరాలు ఇందులో ఉంటాయి. ఈ కార్డులు ఏడాదిగా సరఫరా చేయడం లేదు. దీంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.

పాత కార్డులతో జిరాక్స్‌లు: కార్డులు అందుబాటులో లేక పలు చోట్ల పాత కార్డులే జిరాక్స్ తీయించి వాటిల్లో రాస్తున్నారు. జిరాక్స్ కాగితం మందంగా లేదు. ఇక జిరాక్స్ తీయించేందుకు రూ.20 నుంచి రూ.50 వరకు వ్యయం చేస్తున్నారు.

**17,213 మంది గర్భిణులు..** జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్‌లో 1,344 మంది గర్భిణులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. వీరికి కార్డులు అందుబాటులో లేవు. జిల్లాలో గర్భిణులు 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మొత్తం 17,213 మంది ఉన్నారు. ఉన్నతాధికారులకు నివేదించాం- డాక్టర్ పవిత్ర, మాతా, శిశు సంరక్షణాధికారిణి, వికారాబాద్.

జిల్లాలో ఎంసీపీ కార్డులు సరఫరా కావడంలేదు. దీంతో వీటిని అందించడంలేదు. ప్రస్తుతం జిరాక్స్ తీసిన ప్రతిపైనే వివరాలు నమోదు చేస్తున్నాం.

# గుంతలు గింతే.. కళ్లకు గంతలే



హైదరాబాద్ : నగరంలోని రోడ్లను చూస్తే తవ్వకాల పోటీలు జరుగుతున్నట్టుగా ఉంది. గ్రేటర్‌లో ఎక్కడ చూసినా రోడ్ల చివరన, విభాగినుల వద్ద, రహదారికి అడ్డంగా గుంతలు కనిపిస్తున్నాయి. కాలిబాటల పొడవునా తవ్వకాలు ఇంకా కొనసాగుతున్నాయి. మౌలిక సౌకర్యాల కల్పనకు రహదారులను తవ్వడం అనివార్యం అయినప్పటికీ.. వర్షాలు పడుతున్నప్పుడు కాదు. రోడ్ల తవ్వకం సాధారణమైనప్పటికీ నెలల తరబడి గుంతలను అలాగే వదిలేయకూడదు. కానీ బల్దియా ఇంజినీరింగ్ విభాగం వేటినీ పట్టించుకోవడం లేదు. ఇదే ప్రజలకు శాపంగా మారింది. వేలాది మంది ప్రయాణికులు నడుం, వెన్ను సమస్యకు గురవుతున్నారు. పలు కుటుంబాలు ఆప్తులను కోల్పోతున్నాయి.

**ఇంజినీర్ల నిర్లక్ష్యం:** వేసవిలో తప్ప వర్షాకాలంలో రోడ్ల తవ్వకాలకు అనుమతి ఇవ్వకూడదు. దాదాపు 500కి.మీ పొడవునా రోడ్ల తవ్వకాలకు ముఖ్య ఇంజినీరు కార్యాలయం అనుమతి ఇవ్వగా పని పూర్తయిన మరుసటిరోజే తవ్విన గుంతలను పూడ్చాలన్న నిబంధనను బల్దియా విస్మరించింది. తవ్వకాలకు అనుమతి ఇచ్చే ముందే ఆయా రోడ్ల పునరుద్ధరణకు టెండర్లు పిలవడంపై ఇంజినీర్లు దృష్టి పెట్టలేదు. దీంతో 2 నెలల కిందట తవ్వగా గుంతలు ఇంకా అలాగే ఉన్నాయి.

**ఇవిగో ఉదాహరణలు..**

నెలక్రితం బంజారాహిల్స్ రోడ్డు నెం.1లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి 11 కె.వి విద్యుత్తు తీగలను లాగేందుకు 3 కిలోమీటర్ల పొడవునా తవ్వారు. వారం కిందట మళ్లీ ఆ రహదారిపై తవ్వకాలు మొదలయ్యాయి. మురుగునీటి, వరదనీటి మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి. రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

కేబీఆర్ పార్కు నుంచి బంజారాహిల్స్ రోడ్డు 14కు వెళ్లే రహదారిని ఇటీవల జలమండలి కిలోమీటరు పొడవునా తవ్వేసింది. మ్యాన్‌హోళ్లు దెబ్బతిన్నాయి. వాటిని సరిచేయకుండా గుత్తేదారు మ్యాన్‌హోళ్లను మట్టితో నింపేశారు.

జూబ్లీహిల్స్ అపోలో బస్టాపు నుంచి ఫిల్మ్‌నగర్ కూడలి వరకు ఏడాది కిందట కేబుల్ వైర్ల కోసం తవ్వకాలు జరిగాయి. ఇప్పటికీ ఆ ప్రాంతంలో రోడ్డు పునరుద్ధరణ జరగలేదు.

కేబీఆర్ పార్కు చుట్టూ రోడ్డును ఇరువైపులా తవ్వారు. పంజాగుట్ట కూడలిలో ఎఫ్ఓబీ కింద, పైవంతెన కింద, మెరిడియన్ హోటల్ ఎదురుగా, వేర్వేరు ప్రాంతాల్లో గుంతలు తవ్వారు. కంకర మిశ్రమం రోడ్డుపై పడటంతో వాహనదారులు జారి పడిపోతున్నారు.

షేక్‌పేట నాలా చౌరస్తాలో పైవంతెన కింద తవ్వి ఆ ప్రాంతాన్ని తారు, కంకర మిశ్రమంతో దిమ్మెలా మార్చారు. దాంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

ఎల్బీనగర్ చింతల్‌కుంట చెక్‌పోస్టు నుంచి పెద్దఅంబర్‌పేట వరకు జరుగుతోన్న రహదారి అభివృద్ధి పనులతో, ఉప్పల్ కూడలి నుంచి నారపల్లి వరకు జరుగుతోన్న పైవంతెన నిర్మాణ పనులతో నిత్యం దుమ్ము రేగుతోంది. ఈసీఐఎల్, కాప్రా, తార్నాక, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లోనూ రహదారి తవ్వకం పనులను జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం చేపడుతోంది.

# భావినగరం.. అభివృద్ధి పథం



హైదరాబాద్: రాజధానికి 40 కిలోమీటర్ల దూరంలోని మీర్‌ఖాన్‌పేట్‌లో ఏర్పాటవుతున్న భావినగరంలో నిరంతర అభివృద్ధికి ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. పదేళ్ల వరకు విద్య, ఉపాధి, పరిశ్రమలకు సంబంధించిన కార్యక్రమాలుండాలని ప్రణాళికలను సిద్ధం చేసింది. ఐటీ, ఫార్మా సంస్థలతోపాటు గేమింగ్ జోన్లు, వినోద కేంద్రాలు ఏర్పాటయ్యేందుకు వీలుగా ఫ్యూచర్ సిటీలో స్థలాలను కేటాయించనుంది. భవిష్యత్ విస్తరణకు అనువుగా 56 గ్రామాలు, 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉండాలని మంత్రి డి.శ్రీధర్‌బాబు యోచించారు. ప్రభుత్వం భావినగర అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసి నిర్మాణ పనులను అప్పగించింది. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్ అక్కడ పారిశ్రామిక పార్క్‌ను అభివృద్ధి చేయనుంది.

**కొత్త విశ్వవిద్యాయాలు..**

ఇంక్యుబేషన్ కేంద్రాలు: రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్-ముచ్చర్ల గ్రామాల మధ్యలో భావినగరాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పుడు అక్కడ యంగ్ ఇండియా నైపుణ్యాల విశ్వవిద్యాలయం మాత్రమే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ అధికారులు భావించారు. ప్రస్తుతం స్కిల్స్ వర్సిటీతో పాటు మరో రెండు విశ్వవిద్యాలయాలు అక్కడ కార్యకలాపాలు కొనసాగించనున్నాయి. ఏఐ విశ్వవిద్యాలయం ప్రతిపాదనల్లో ఉండగానే ఆస్ట్రేలియా ప్రతినిధులు అక్కడ తమకు స్థలం కేటాయిస్తే ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణ అందించే వర్సిటీని ప్రారంభిస్తామని తెలిపారు. వర్సిటీలకు అనుబంధంగా పరిశోధన, ఇంక్యుబేషన్ కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహమం దించనుంది. కొద్దిరోజుల క్రితం సిరానెట్ వర్క్ సంస్థ ఈ-సిటీని మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది.

**వారాంతాల్లో హాయ్.. హాయ్‌గా**

ఐటీ, ఫార్మా సంస్థలు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు (జీసీసీ) కార్యకలాపాలతోపాటు వారాంతాల్లో ఆటవిడుపుగా గేమింగ్‌జోన్లు, వినోద కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కొన్ని అంతర్జాతీయ సంస్థలు అమ్యూజ్‌మెంట్ పార్కులను ప్రారంభించేందుకు ప్రభుత్వంతో చర్చించాయి. ముంబయి, హైదరాబాద్‌లో క్రీడలను ప్రోత్సహిస్తున్న సంస్థలు అక్కడ శాఖలను ప్రారంభించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. వీటికి అదనంగా నైట్‌బజార్ తరహాలో ఆహారోత్సవాలు, క్రీడా పోటీల నిర్వహణకు ప్రైవేటు సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదించాలని నిర్ణయించాయి.

# ఆనకట్ట.. పంటలకు ఆయువుపట్టు

తాండూరు : జిల్లాలో కాగ్నా, కాకరవేణి నదుల నుంచి వృథాగా పోతున్న వరదను కట్టడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనువుగా ఉన్న ఆరు ప్రాంతాల్లో ఆనకట్టల (చెక్‌డ్యాంల) నిర్మాణం చేపట్టాలని భావించింది. ఇవి పూర్తయితే ఎగువ నుంచి వచ్చే వరద దాదాపు అరకిలో మీటరు వరకు నిలిచిపోతుంది. ఫలితంగా భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. ఇందులో భాగంగానే 2022-23లో అప్పటి ప్రభుత్వం రూ.43కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం కూడా వాటిని కొనసాగించాలని సర్కారు పచ్చజెండా ఊపింది. మంజూరైన నిధుల ఆధారంగా మూడు చోట్ల గుత్తేదార్లు పనులు ప్రారంభించారు.

**ఒనగూరే ప్రయోజనాలు ఎన్నో..**

ఒక్కో ఆనకట్ట ఆరు అడుగుల ఎత్తుతో అరకిలో మీటరు పొడవునా వరద నిలుస్తుంది. పరీవాహక గ్రామాల్లోని వ్యవసాయ బోర్లు, తాగు నీటి వనరుల్లో భూగర్భ జలమట్టం గణనీయంగా పెరుగుతుంది. సాగులో ఉన్న పంటలకు ఎద్దడి లేకుండా నీరు అందుతుంది. ఒక్కో ఆనకట్ట పరిధిలో ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం 400 నుంచి 600 ఎకరాలు పెరుగుతుంది.

నిలువ ఉన్న నీటిలో మత్స్యకారులు చేపలు పెంచి ఉపాధి పొందవచ్చు. అన్ని కాలాల్లో వాటి వద్ద వన్యప్రాణులు, పక్షులు దాహార్తిని తీర్చుకుంటాయి.

**90 శాతం చొప్పున..**

యాలాల మండలం దేవనూరు కాకరవేణి, బెన్నూరు కాగ్నా నదిపై ఒక్కో ఆనకట్ట పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఎగువ నుంచి అడపాదడపా వస్తున్న వరద అక్కడే ఆగిపోవడంతో జలకళ సంతరించుకుంటున్నాయి. దీనివల్ల భూగర్భజలం వృద్ధి చెందేందుకు దోహద పడింది. వర్షాకాలం పూర్తి కాగానే మిగిలిన పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నారు. తాండూరు మండలం ఖాంజాపూరు కాగ్నానదిపై మరో ఆనకట్ట నిర్మాణం 70 శాతం పూర్తయింది. ప్రస్తుతం వర్షాలు కురవడంతో పనులు ఆగిపోయాయి.



**పనులు మొదలు కాక..**

పెద్దేముల్ మండలం మన్‌సాన్ పల్లి, తాండూరు మండలం చంద్రవంచ, యాలాల మండలం సంగెంకుర్దు సమీపం కాగ్నా నదిలో ఒక్కో ఆనకట్ట నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. వీటిలో ఒక్కో ఆనకట్ట నిర్మాణానికి రూ.7 కోట్ల నుంచి రూ.8కోట్ల వరకు సిద్ధంగా ఉన్నాయి. వేసవిలో పనులు చేపట్టేలా అధికారులు చొరవ చూపలేదు. ఇటీవలే గుత్తేదార్లు ముందుకు వచ్చినా, వానలతో ఆపేశారు. సంగెంకుర్దు వద్ద గుత్తేదారును మార్చాలని అధికారులు ఉన్నత స్థాయి అధికారులను కోరారు. స్పందించక పోవడంతో రెండేళ్ల నుంచి పనులు ఆగిపోయాయి.

**వచ్చే వేసవి నాటికి పూర్తిచేస్తాం- కిష్టయ్య, శిరీష, నీటిపారుదల శాఖ డీఈఈలు.** యాలాల మండలం సంగెంకుర్దు, తాండూరు మండలం చంద్రవంచ, పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి గ్రామాల సమీపం కాగ్నానదిలో వచ్చే వేసవి నాటికి ఆనకట్టల నిర్మాణం పూర్తి చేస్తాం. ప్రస్తుతం పనులు ప్రారంభమై తుదిదశలో ఉన్న వాటిని పూర్తి చేస్తాం.

# అవసరాలకు అనుగుణంగా నడిపేలా..

హైదరాబాద్: ఎంఎంటీఎస్ సర్వీసులను నగరంలో ప్రారంభించి 22 ఏళ్లవుతున్నా ఆశించిన స్థాయిలో ప్రయాణికులకు సేవలు అందడం లేదు. నగరంలోని నాలుగు ప్రధాన స్టేషన్ల నుంచి 225 రైళ్లలో నిత్యం లక్షలాది మంది ప్రయాణికులను గమ్యస్థానం చేర్చే వ్యవస్థలున్నా స్థానికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌ను విస్తరించడంలో జాప్యం జరుగుతోంది. సమయ పాలన లేకపోవడం, ఒకటి, రెండు రైళ్లతో నెట్టుకురావాలని ప్రయత్నిస్తుండమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా నగరంలో స్టేషన్లను పునరుద్ధరిస్తున్న నేపథ్యంలో ఎంఎంటీఎస్ విస్తరణకూ ఇదే మంచి సమయమని ప్రయాణికుల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

**ట్రాక్ సర్క్యూట్‌ను సవరిస్తే..** రేక్‌ల లభ్యత పరిమితంగా ఉన్న క్రమంలో సికింద్రాబాద్-ఫలక్‌నుమా-మేడ్చల్ మార్గంలో తొమ్మిది లేదా పన్నెండు కోచ్‌లకు బదులుగా ఆరు కోచ్‌ల రైళ్లను నడపాలని తద్వారా మిగిలిన ప్రాంతాలకు మరిన్ని రైళ్లు నడిపే అవకాశం ఉంటుందని ప్రయాణ




సంఘాలు పేర్కొంటున్నాయి. కాచిగూడ నుంచి ఉదయాన్నే ప్రారంభించే రైళ్లను అందుకోవడానికి, కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికుల వేళలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ రైళ్లు నడపాలని కోరుతున్నారు. మేడ్చల్ నుంచి ఉదయం 5.30గంటలకు, రెండో రైలు ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యేలా వేళలు మార్చాలని, గంటలో సికింద్రాబాద్ చేరుకునేలా వేళలు మార్చి అక్కడి నుంచి లింగంపల్లికి అనుసంధానించాలని డిమాండ్ చేస్తున్నారు. **వికేంద్రీకరణ అవసరం..** సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్, లింగంపల్లి వంటి స్టేషన్లను వికేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. మెరుగైన నెట్‌వర్క్ వినియోగం కోసం, చర్లపల్లి నుంచి సనత్‌నగర్ లేదా సికింద్రాబాద్ మీదుగా వికారాబాద్ వైపు కొన్ని సర్వీసులను, మల్కాజిగిరి మీదుగా కర్నూలు వైపు మరిన్ని సర్వీసులను ప్రారంభించొచ్చు. సికింద్రాబాద్ స్టేషన్‌లో పనులు పూర్తయ్యే వరకు ముంబయికి సర్వీసులు హైదరాబాద్ లేదా చర్లపల్లి నుంచి నడపొచ్చు. రైల్వేలకు అదనపు ఆదాయం, ప్రయాణికుల సౌలభ్యం కోసం జంట నగరాల్లో ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌ను విస్తరించడంపై అధికారులు దృష్టి సారించాలి.

# పదవుల్లో పైచేయి ఎవరిదో!

కరీంనగర్ : ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు ఆశల లోకంలో విహరిస్తున్నారు. పీసీసీ కార్యవర్గంలో పలువురికి చోటు కల్పించే దిశగా పార్టీ అధిష్ఠానం దిల్లీ కేంద్రంగా కసరత్తు జరుపుతున్న దరిమిలా కొందరు ముఖ్య నాయకులు తమకు అవకాశం వస్తుందనే ధీమాతో ఉన్నారు. రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్న తరువాత నామినేటెడ్ పోస్టుల భర్తీలో కొందరికి అవకాశాలు దక్కగా ఇంకొందరికి పార్టీలో కీలక పదవులను అప్పగిస్తారనే ప్రచారం జరిగింది. దీంతో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన సీనియర్లతోపాటు యువ నాయకులు కూడా పార్టీ పదవుల భర్తీ విషయంలో గంపెడాశలు పెట్టుకున్నారు. నిర్ణయం ఈ నెల 30కి వాయిదా పడటంతో ఆ రోజు కోసం నిరీక్షిస్తున్నారు.

**అమాత్య యోగం దక్కేనా!**

మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు అమాత్య పదవి వస్తుందనే చర్చ పార్టీలో జరుగుతోంది. 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్దపల్లి, మంథని, రామగుండం, మానకొండూర్, చొప్పదండి, ధర్మపురి, వేములవాడ.. ఇలా ఏడు నియోజకవర్గాల్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీకి మొదటి దఫాలో మంథని నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీధర్‌బాబుకు మంత్రి పదవిని కట్టబెట్టారు. ఇక కరీంనగర్‌కు చెందిన సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నుంచి గెలిచి బీసీ కోటాలో మంత్రి పదవిని దక్కించుకున్నారు. భారాస నుంచి అయిదుగురు ఎమ్మెల్యేలు గెలవగా జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ కాంగ్రెస్ మద్దతివ్వడంతో సమీకరణాలు మారాయి. ఉమ్మడి జిల్లా నుంచి మరో ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు ఇచ్చే అవకాశముందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మున్నూరు కాపు కోటాలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరు వినిపిస్తోంది. కీలకమైన సిరిసిల్ల జిల్లాలో పార్టీ పట్టును పెంచాలంటే ఆ జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలనే దిశగా చర్చ సాగుతున్నట్లు సమాచారం.

**కొత్త జిల్లాధ్యక్షులు..**

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 10 జిల్లాల్లో కొత్త డీసీసీలను నియమించే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పుడు నాలుగు జిల్లాల్లో ఎమ్మెల్యేలే అధ్యక్షులుగా కొనసాగుతుండటంతో వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇస్తే పార్టీలో ఊపు కనిపిస్తుందనే ఉద్దేశంతో మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు సమాచారం. దీంతో పలువురు ముఖ్య నాయకులు పార్టీ పగ్గాలను అందుకోవాలని కుతూహలం చూపిస్తున్నారు. ఇందుకోసం మంత్రులను కలుస్తూ తమకు అవకాశాన్నివ్వాలని కోరుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులు ఇతరత్రా బిజీగా ఉంటుండటంతో నాలుగు జిల్లాల్లో కొత్త సారథులు వచ్చే అవకాశముందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి.

# రోడ్డు తవ్వేస్తామంటూ.. అడ్డగోలు ప్రతిపాదనలు

హైదరాబాద్: నగరం నలుమూలల నుంచి రహదారుల తవ్వకాల కోసం ఇంజినీర్లు పంపుతున్న ప్రతిపాదనలు అడ్డగోలుగా ఉంటున్నాయని జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. పూర్తి వివరాలు పేర్కొనకుండా ప్రతిపాదనలు పంపిస్తుండటంపై ముఖ్య ఇంజినీరు(సీఈ) సహదేవ్ రత్నాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు నమూనాలతో ఆయన తాజాగా ఇంజినీర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు.

**మార్గదర్శకాలు ఇలా..**

10మీటర్ల పొడవున రోడ్డును తవ్వేందుకు సర్కిల్ స్థాయిలో కార్యనిర్వాహక ఇంజినీరు.. 10నుంచి 15మీటర్ల మధ్య జోన్ స్థాయిలోని సూపరింటెండెంట్ ఇంజినీరు అనుమతి తీసుకోవాలి. అంతకన్నా పెద్ద ప్రతిపాదనలను ముఖ్య ఇంజినీరు ఆమోదిస్తారు.

తవ్విన రోడ్లను పునరుద్ధరించే పనులకు పరిపాలన అనుమతి కావాలంటే.. ఆయా రహదారులను తవ్వడానికి ప్రజలు లేదా సంస్థ పెట్టుకున్న అర్జీని జత చేయాలి.జీ.వో.నెం.53 ప్రకారం చదరపు



మీటరు తారురోడ్డు తవ్వేందుకు రుసుమును కచ్చితంగా అంచనా వేయాలి. లోపాలకు ఇంజినీర్లే బాధ్యులు.

**తప్పని విమర్శలు**

ఈ మార్గదర్శకాలపై విమర్శలొస్తున్నాయి. రహదారి తవ్వకానికి అంచనాలు రూపొందించడంతోపాటే.. ఆ రోడ్డును పునరుద్ధరించేందుకు అవసరమైన టెండరు నోటిఫికేషన్ రూపుదిద్దుకోవాలి. పునరుద్ధరణ పనులకు గుత్తేదారును సిద్ధం చేశాకే.. తవ్వకం అనుమతి జారీ అవ్వాలి. గతంలోని ఈ నిబంధనను చీఫ్ ఇంజినీరు కార్యాలయం పట్టించుకోవట్లేదనే ఆరోపణలొస్తున్నాయి. రోడ్డు తవ్వకం పనులు పూర్తయ్యాక పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు పంపాలన్న సీఈ ఆదేశాలు సరికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తారు రోడ్డును చదరపు మీటరు తవ్వితే రూ.4,550, సీసీ రోడ్డును తవ్వితే రూ.3,688ల రహదారి పునరుద్ధరణ రుసుమును వసూలు చేయాలనే నిబంధనను జీహెచ్ఎంసీ గుడ్డిగా అనుసరిస్తోంది. తారు రోడ్డుతో పోలిస్తే.. నాలుగు రెట్ల అదనపు ఖర్చుతో వీడీసీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. పునరుద్ధరణ రుసుము మాత్రం తారు రోడ్డుకన్నా తక్కువ ఉండటం విమర్శలకు తావిస్తోంది.

# చల్లగా వచ్చి దోచుకెళ్లాడు

కరీంనగర్ : అర్ధరాత్రి సమయంలో చల్లగాలి కోసం ఇంటి ప్రధాన తలుపు తీసి, జాలి తలుపు వేసుకొని నిద్రిస్తే ఓ దుండగుడు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయాడు. కరీంనగర్ రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ సప్తగిరికాలనీకి చెందిన నేరెళ్ల రమేశ్‌గౌడ్ రెండేళ్లుగా ఆదిలాబాద్ భుక్తపూర్‌లో మెడికల్ ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. సోమవారం తన భార్య సోదరుడి కుమారుడు నామకరణం ఉండటంతో రమేశ్‌గౌడ్, అతని భార్య సుజాత ఆదివారం కరీంనగర్‌కు వచ్చి శుభకార్యానికి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసి అర్ధరాత్రి ఇంటికి వచ్చారు. ఇంట్లో చల్లగాలి కోసం రెండు వైపులా ఉన్న తలుపులు తీసి జాలి డోర్లను దగ్గరకు వేసి నిద్రించారు. ఉదయం శుభకార్యానికి వెళ్లేందుకు బంగారు ఆభరణాలు, నగదును ఒక సంచిలో వేసి ఉంచారు. సోమవారం ఉదయం లేచి నామకరణం వేడుకకు వెళ్లేందుకు సిద్ధంకాగా ఆభరణాల సంచి కనిపించలేదు. రూ.2.62 లక్షల విలువగల ఆభరణాలు, బీరువాలోని రూ.35 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నగర ఏసీపీ వెంకటస్వామి, సీఐ సృజన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ఓ యువకుడు ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# సర్కారు బడుల్లో సౌకర్యాలపై ఆరా

పెద్దపల్లి : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పాఠశాలలు బలోపేతం అవుతున్నా.. బాలల ప్రవేశాలు పెరగడంలేదు. విద్యార్థుల సామర్థ్యాలు ఆశించిన స్థాయిలో ఉండటంలేదు. ఏటా ప్రభుత్వానికి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు వాటిపై గణాంకాలు అందిస్తున్నా మార్పు ఎందుకు రావడం లేదనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు వాటి పరిస్థితి ఎలా ఉందనే దానిపై రాష్ట్ర విద్యాశాఖ సర్వే చేపట్టేందుకు ముందుకొచ్చింది. ఈనెల 21 వరకు ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో కరీంనగర్ సమీపంలోని 130 మంది డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులు దీనిపై సర్వే చేపడుతున్నారు. **పొందుపరిచిన వివరాల ఆధారంగా**

ఏటా ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లస్‌లో వివరాలను ప్రామాణికంగా పొందుపరుస్తున్నారు. వాటి ఆధారంగానే వాటిలో సౌకర్యాల కల్పన, ఇతరత్రా వాటికి ప్రభుత్వాలు బడ్జెట్‌లు కేటాయిస్తున్నాయి. అన్ని యాజమాన్యాల పాఠశాలలకు తోడు జూనియర్ కళాశాలల సమగ్ర వివరాలను ఇందులో నమోదు చేస్తున్నారు. వాటిలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఖాళీలు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, తరగతి గదుల పరిస్థితి, క్రీడా మైదానాలు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, తాగునీరు తోపాటు కొరతగా ఉన్న వాటి వివరాలను ప్రధానోపాధ్యాయులు పొందుపరుస్తున్నారు. **ఒక్కొక్కరికి 10 పాఠశాలలు**

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గాకుండా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న వాటిల్లో ఈ సర్వే చేపడుతున్నారు. ఒక్కొక్కరు నిత్యం 10 పాఠశాలలను సందర్శించి పాఠశాల విద్యా ప్రామాణిక రిపోర్టు ఆధారంగా సర్వే చేస్తారు. వాస్తవ పరిస్థితుల వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేశారా? విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయనేది పరిశీలించి ధ్రువీకరించనున్నారు. వాటిలో తప్పులుంటే సరి చేయాలని రిమార్కులు అందిస్తారు. అప్పటికప్పుడు సీఆర్పీల సాయంతో ప్రధానోపాధ్యాయులు సరిచేస్తారని.. కరీంనగర్ జిల్లా సమగ్రా శిక్షా ప్లానింగ్ కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

# క్రీడలకు వేళాయె



ఆసిఫాబాద్ : జిల్లాలో 14ఏళ్ల లోపు బాల, బాలికలకు వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించేలా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహించే వీటి కోసం ఇప్పటికే శిక్షకుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఎంపిక చేశారు. అన్ని జిల్లాలకు క్రీడా సామగ్రి పంపిస్తామని బుధవారం రాష్ట్ర యువజన, క్రీడల సర్వీసు విభాగం అధికారులు అన్ని జిల్లాల యువజన క్రీడల అధికారులతో టెలి కాన్ఫరెన్సులో పేర్కొన్నారు. గురువారం క్రీడా సామగ్రి జిల్లాకు చేరుతోందని.. ఆలోపు కబడ్డీ, ఖోఖో వంటి క్రీడలను ప్రారంభించేలా అధికారులు సిద్ధమవుతున్నారు. అవి వచ్చాక నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులకు తర్ఫీదునిస్తారు. అయితే ఈ సారి పట్టణాల కంటే మెజారిటీ గ్రామీణ ప్రాంతాల్లోనే శిబిరాలు ఏర్పాటు చేశారు.

**విధిగా హాజరు..**

ఇది వరకు క్రీడా శిబిరాలకు వచ్చే క్రీడాకారుల పేర్లు నామమాత్రంగా నమోదు చేసేవారు. తక్కువ వచ్చినా ఎక్కువ వచ్చినట్లు చూపే వారనే విమర్శలు ఉన్నాయి. ఈ సారి శిబిరాలకు వచ్చే ప్రతి క్రీడాకారుడి పేరు, ఆధార్ వివరాలు అంతర్జాలంలో నమోదు చేయాలి. ఒక్కో శిబిరంలో కనీసం 20 మందికి తక్కువ కాకుండా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేలా చూడాలి. అదే కాకుండా రోజూ శిబిరాలకు వచ్చే వారి హాజరు నమోదు చేయాలి. దీంతో ఏ శిబిరంలో ఎంత మంది వస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. శిబిరాలకు తమ పిల్లలను పంపించేలా తల్లిదండ్రులు సైతం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా క్రీడలకు వెచ్చించడంతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సిద్ధిస్తుంది.

**ఎక్కడ ఏ క్రీడలంటే..**

జిల్లా కేంద్రం జన్కాపూర్‌లో హ్యాండ్‌బాల్, రాజంపేట్‌లో ఖోఖో, ఆసిఫాబాద్ మండలం బూరుగూడలో నెట్‌బాల్, తిర్యాణి మండలం రోంపల్లిలో కబడ్డీ, మండల కేంద్రంలో అథ్లెటిక్స్, అదే మండలం రాళ్లకన్నెపల్లిలో వాలీబాల్, కాగజ్‌నగర్ మండలం బురుదగూడెంలో షూటింగ్‌బాల్, సరండిలో సాఫ్ట్‌బాల్, వేంపెల్లిలో బాక్సింగ్, నజ్రూల్‌నగర్‌లో కరాటే శిక్షణ శిబిరాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం పది మంది శిక్షకులను నియమించారు. ఈ సారి శిక్షకులకు ఇచ్చే గౌరవ వేతనం రూ.వెయ్యి పెంచారు. ఇది వరకు రూ.4 వేల పారితోషికం ఇచ్చే వారు.

# మూడేళ్లవుతున్నా.. ముందడుగేది?



ఉట్నూరు : మూడేళ్ల కిందట కొత్త వంతెనలు, రహదారుల మరమ్మతులకు రూ.12 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టడంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉట్నూరు నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో వాగులపై వంతెనలు శిథిలావస్థకు చేరి తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. టెండర్ల ప్రక్రియను పూర్తిచేసిన అధికారులు కొత్త వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూరు నుంచి ఆదిలాబాద్, మహారాష్ట్రకు వెళ్లే బీటీ రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ఆ రోడ్డు మధ్యలో పులిమడుగు, నాగాపూర్, శ్యాంపూర్, హస్నాపూర్, ఏందా గ్రామాల వద్ద వాగులు, కాలువలు ఉండటంతో గతంలో రెండు కల్వర్టులు, రెండు వంతెనలు నిర్మించారు. భారీ వాహనాలు వెళ్లడం, రద్దీ పెరగడం, వర్షాలతో వాగులు పొంగి కల్వర్టులు దెబ్బతిన్నాయి. వంతెనల గోడలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. ఏటా ఈ రహదారిపై ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పలు వాహనాలు వాగుల్లో పడి ధ్వంసమయ్యాయి. ఏళ్లుగా కొత్త వంతెనలు నిర్మించాలని మొరపెట్టుకుంటుంటే ప్రభుత్వం స్పందించి 2022లో కొత్త వంతెనలు మంజూరు చేసింది. రూ.12 కోట్లతో నిర్మాణం కోసం రోడ్లు - భవనాల(ఆర్‌అండ్‌బీ) శాఖ ఆధ్వర్యంలో టెండర్లను పిలిచారు. నిర్మాణ పనులు చేపట్టడంతో జాప్యం జరుగుతోంది.

**చేపట్టాల్సిన పనులివే..** శిథిలావస్థకు చేరిన నాగాపూర్, పులిమడుగు, శ్యాంపూర్, హస్నాపూర్, ఏందా ఈ అయిదు వంతెనలను తొలగించి వాటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాల్సి ఉంది. వీటికి ఇరువైపులా రహదారి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఉట్నూరు మండల కేంద్రం నుంచి 8 కిలోమీటర్ల దూరంలోని పులిమడుగు గ్రామం శివారులోని వాగుపై రూ.4.50 కోట్లతో 60 మీటర్ల పొడవు, 10 మీటర్ల ఎత్తులో వంతెన నిర్మించాలని ప్రణాళికను రూపొందించారు. వీటితోపాటు రెండు కిలోమీటర్ల వరకు రహదారి మరమ్మతులు చేయనున్నారు.

శ్యాంపూర్, ఏందా గ్రామాలలోని వంతెనలు శిథిలావస్థకు చేరాయి. గోడలు పడిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ రెండు గ్రామాలలో ఒక్కో వంతెన రూ.3 కోట్లతో రెండు వంతెనలు నిర్మించాల్సి ఉంది. వంతెనలకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల వరకు రోడ్డును బాగు చేయాల్సిఉంది.

నాగాపూర్‌లోని శివసాగర్ ప్రాజెక్టు కింది భాగంలోని వాగుపై ఉన్న వంతెన తెగిపోయింది. ఏటా వర్షాకాలంలో వాగు పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.2 కోట్లతో 40 మీటర్ల పొడువు, 6 మీటర్ల ఎత్తుతో కొత్త వంతెన నిర్మించాల్సి ఉంది.

**గుత్తేదారులకు నోటీసులు ఇచ్చాం.. -ఎస్.నర్సయ్య, ఈఈ, ఆర్‌అండ్‌బీ**

వంతెనలు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయింది. గుత్తేదారులు పనులు చేపట్టడంలో ఆలస్యం చేస్తున్నారు. గుత్తేదారులకు నోటీసులు ఇచ్చాం. త్వరలో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

# కబ్జా చేస్తారు.. దర్గాగా పాతుకుపోతారు!

ఖమ్మం : ఖమ్మం జిల్లాలో అత్యధికంగా తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడులోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ భూములు ఆక్రమణకు గురయ్యాయి. దేవాదాయశాఖ లెక్కల ప్రకారమే 512.33 ఎకరాలు కబ్జా చెరలో ఉన్నాయి. దశాబ్దాలుగా ఈ భూములను ఆక్రమించుకున్నవారు దర్జాగా పంటలు పండిస్తున్నారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూముల్లో సగానికి పైగా ఆక్రమణల చెరలోనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో రాములవారికి 1,300 ఎకరాల వరకు స్థలాలు ఉండగా.. వీటిలో 985.24 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో స్వామివారి 800 ఎకరాల భూముల్లో ఎక్కువ భాగం ఆక్రమణల్లో ఉన్నాయి. వీటిని స్వాధీనపరచుకునేందుకు గతంలో చాలాసార్లు ఆలయాధికారులు ప్రయత్నించినా ఫలితం లేదు. స్థలాలు దేవస్థానానివేనని ఆలయాధికారులు, హక్కులన్నీ తమకే ఉన్నాయని పురుషోత్తపట్నానికి చెందిన కొందరు తెగేసి చెబుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో దశాబ్దాలుగా దేవాదాయశాఖ భూములు అత్యధికం ఆక్రమణల చెరలోనే మగ్గుతున్నాయి. 225 ఆలయాల ఆధీనంలో సుమారు 14,391 ఎకరాల భూములు ఉన్నాయి. ఉభయ జిల్లాల్లో 9,675 ఎకరాలను కౌలుకు ఇచ్చారు. 1,595 ఎకరాల భూమి అర్చకుల ఆధ్వర్యంలో ఉండగా.. 1,137 ఎకరాల భూములు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో 833.02 ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 1151.05 ఎకరాల ఆలయాల భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నట్లు దేవాదాయశాఖ గుర్తించింది. వీటికి సంబంధించి దేవాదాయశాఖ ట్రైబ్యునల్‌లో 39, హైకోర్టులో 35 కేసులు నడుస్తున్నాయి. దేవాదాయశాఖకు కొందరు రైతులు కౌలు కూడా చెల్లించకపోవటం గమనార్హం.



దేవాదాయశాఖకు సవాల

ఉభయ జిల్లాల్లోని దేవుడి మాన్యాలు, ఆస్తులు, భూములను పరిరక్షించేందుకు దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధునిక, సాంకేతికతను ఉపయోగించినా ఫలితం లేకుండా పోయింది. ఆలయాల స్థలాలకు సంబంధించి గూగుల్ సహకారంతో జియో ట్యాగింగ్ పూర్తిచేశారు. కబ్జాలకు గురైన భూముల్లో అత్యధికం దేవాలయాల భూములే ఉన్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా వాటిని స్వాధీనపరచుకోవటంలో సంబంధింత శాఖ అధికారులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు సరిపడా సిబ్బంది లేకపోవటంతోచేతులెత్తేస్తున్నారు. ఆక్రమణల పర్వం అంతకంతకూ పెరిగేందుకు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలేమి మరో కారణమనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

దేవాదాయశాఖ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ఆక్రమణలకు సంబంధించి ప్రభుత్వానికి అన్ని వివరాలు సమర్పించాం. కొన్ని ఆలయాల భూముల కబ్జాలపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ముందుకెళ్తాం.

ఎం.వీరాస్వామి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్

# మట్టిగుట్టలు.. మాయం..!

నకిరేకల్ : గుట్టలుగా నిల్వ చేసిన మట్టిని అక్రమార్కులు గుట్టుగా తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా తరలిస్తుండటంతో ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. జిల్లాలో ముఖ్యమైన నీటి వనరుగా ఉన్న ఏఎంఆర్ ప్రధాన కాల్వ వెంట నిల్వ చేసిన మట్టి (సాయిల్ బ్యాంక్) తరిగిపోతోంది. ప్రధాన కాల్వ తవ్వకం ద్వారా వచ్చిన మట్టిని గతంలో దీని వెంట గుట్టలుగా పోసి నిల్వ చేశారు. ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ, పిల్లకాల్వలకు గండ్లు పడినప్పుడు, పంట కాల్వలు, కాల్వకట్టలపై రహదారుల నిర్మాణం తదితర ప్రభుత్వ నిర్మాణల భవిష్యత్ అవసరాల కోసం వినియోగించేందుకు దీనిని నిల్వ చేశారు. వేల క్యూబిక్ మీటర్లలో ఉన్న ఈ మట్టిపై అక్రమార్కులు కన్నేసి కాజేస్తున్నారు. ఈ కాల్వ వెంట నీటిపారుదల శాఖ లస్కర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా.. మట్టి మాయమవుతుండటం గమనార్హం.

నకిరేకల్- కేతేపల్లి మండలాల మధ్య కాల్వ వెంట 25 కి.మీ నుంచి 27 కి.మీ వరకు ఉన్న మట్టిని తాజాగా తరలిస్తున్నారు. భవన నిర్మాణ పనులు, ఇతర అవసరాల కోసం మట్టిని పొక్లెయిన్లతో తోడి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ మట్టిని ఒక్కో ట్రిప్పును రూ.వెయ్యి నుంచి 1200 వరకు వరకు విక్రయిస్తున్నారు. అధికారుల ప్రత్యేక అనుమతితో ప్రభుత్వ అవసరాల కోసం గుత్తేదారులు క్యూబిక్ మీటరుకు రూ.70 చొప్పున గనుల శాఖకు చెల్లించి తరలించుకునే వీలుంది. ఎలాంటి అనుమతులు



లేకుండా ప్రైవేట్ నిర్మాణాల కోసం తీసుకెళుతున్నారు

ప్రధాన కాల్వకు ఇరువైపులా ఏఎంఆర్పీ స్థలంలో నిల్వ చేసిన ఈ మట్టి ఖాళీచేసిన భూములను సమీప రైతులు తమ పట్టాభూముల్లో కలిపేసుకుంటున్నారు. కాల్వ వెంట రహదారులను ఆక్రమించేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మట్టి దందాను నిరోధించి ఏఎంఆర్పీ భవిష్యత్ అవసరాల కోసం మట్టిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

ఏఎంఆర్పీ ప్రధాన కాల్వ వెంట మట్టిని తరలిస్తున్న విషయం మాదృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి మట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం. మాశాఖ లస్కర్ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. మహేశ్ ఏఈ, నీటిపారుదల శాఖ

# ఆదాయం.. అంతంతే..!

నల్గొండ : ఉమ్మడి జిల్లాలోని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు గడిచిన ఆర్థిక ఏడాదిలో వచ్చిన ఆదాయం నామమాత్రంగానే ఉంది. 2023-24 ఆర్థిక ఏడాదితో పోల్చితే 2024-25 ఏడాదిలో అదనంగా రూ.7 కోట్లు మాత్రమే పెరిగింది. గత ఏడాదిలో రూ.412.37 కోట్లు వస్తే 2024-25లో మార్చి చివరి నాటికి రూ.419.49 కోట్లు వచ్చాయి. ప్రభుత్వానికి ఆదాయం పెరిగినా సంబంధిత శాఖ లక్ష్యానికి చేరువ కాలేకపోయింది. జిల్లాలో 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా గత ఏడాది 1,43,426 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరగ్గా.. ఈఏడాది 1,38,729 జరిగాయి. రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్నా పెరిగిన ధరలతో రూ.7 కోట్లు ఆదాయం వచ్చింది. అత్యధికంగా నల్గొండ, సూర్యాపేట, యాదగిరిగుట్ట, దేవరకొండ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆ తరువాత స్థానాల్లో చౌటుప్పల్ భువనగిరి, బీబీనగర్ కోదాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.

**అవగాహన పెరిగి..**

జిల్లాలో గత ఆర్థిక ఏడాదిలో భూముల క్రయ,విక్రయాలు అనుకున్న స్థాయిలో జరగలేదని సంబంధిత అధికారులు వాపోతున్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది వంద గజాల స్థలం కొనుగోలు చేసేవారు కూడా అన్ని విధాలా పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వ భూమి, శిఖం భూమి, ఎఫ్‌టీఎల్, నాన్ ఎఫ్‌టీఎల్ వంటి, వెంచర్ల అనుమతులు, నాలాల అనుమతులతో పాటు ఎల్ఆర్ఎస్ అనుమతులపై అన్ని వర్గాల వారిలో అవగాహన పెరిగింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేని భూములను కొనుగోలు చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

**వేగవంతంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ**

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ అవినీతికి తావులేకుండా చూస్తున్నాం. మధ్యవర్తులు లేకుండా అధికారులు, సిబ్బందితో పనులు చేయించుకోవాలి. అవినీతికి పాల్పడేవారి సమాచారం ఇచ్చేవారు నేరుగా జిల్లా కార్యాలయంలో సంప్రదించవచ్చు. ఎల్ఆర్ఎస్‌కు అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ స్లాట్‌బుకింగ్‌లు త్వరలో అన్ని కార్యాలయాల్లో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎస్. ప్రకాశ్, డీఆర్ ఉమ్మడి నల్గొండ

# సభ్యత్వాల పేరుతో అక్రమాలు..!

నల్గొండ : మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పలువురు దోపిడీ చేస్తున్నారు. మత్స్య సహకార సంఘాలు ఉన్నా.. వాటి నిర్వహణపై అధికారులు శ్రద్ధ పెట్టకపోవడం వల్ల అవి కనుమరుగైపోతున్నాయి. మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వాలు ఇప్పిస్తామంటూ కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో మిర్యాలగూడ పెద్ద చెరువు, యాదగార్‌పల్లి, శ్రీనివాసనగర్, చింతపల్లి చెరువులు ఉన్నాయి. గతంలో ఇందులో 281 మంది సభ్యులు ఉండగా.. ప్రస్తుతం 71 మంది ఉన్నారు. ఆరేళ్లుగా కొత్త సభ్యులను చేర్చడం లేదు. ఇటీవల ఎలాంటి జనరల్ సమావేశం లేకుండా..వారసులకు సభ్యత్వాలు ఇస్తామంటూ కొత్త సభ్యులను చేర్చుకునే కార్యక్రమానికి తెరలేపారు. ఇలా ఒక్కొక్కరి నుంచి రూ.3000 చొప్పున 200 మంది నుంచి డబ్బులు వసూలు చేశారని విశ్వసనీయ సమాచారం. ఇందులో అధికారుల పాత్ర ఉందని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈత రాకున్నా, చేపలు పట్టడం తెలియకున్నా.. సభ్యత్వం ఇప్పిస్తామంటూ సంఘంలో కొందరు పెద్ద మొత్తంలో వసూలు చేశారు. ఈనెల 16న కొత్త సభ్యులను చేర్చుకునే తేదీ ఎంపిక చేశారు. చెరువులో వలలు వేయడం, చేపలు పట్టడం వచ్చిన మత్స్యకార్మికులు తాము సభ్యత్వాలకు డబ్బులు ఎందుకు ఇవ్వాలని మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. బైలా ప్రకారం రుసుం తీసుకొని సభ్యత్వం ఇవ్వాలని కానీ.. రూ.3వేలు ఏంటని ప్రశ్నిస్తున్నారు.

**16న కొత్త సభ్యుల ఎంపిక** మత్స్యకార సంఘంలో కొత్త సభ్యులను చేర్చుకునే సందర్భంలో ఈత కొట్టడం, వలలు వేయడం, చేపలు పట్టడం చేస్తుంటే మత్స్యశాఖ వీడియోలో చిత్రీకరించాలి. ఈ కార్యక్రమం మిర్యాలగూడలో 16న చేస్తామని మత్స్యశాఖ అధికారులు చెప్పారని కొందరు సభ్యులు తెలిపారు. ఇందులో వృత్తిలో అనుభవం ఉన్న వారిని ఎంపిక చేయాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సభ్యుల వద్ద వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు.


**అనుభవం మేరకే..** మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో అనుభవం ఉన్న వారికే సభ్యత్వం ఇస్తాం. వారి నైపుణ్యాన్ని వీడియోలు తీస్తాం. అనుభవం లేని వారికి ఇవ్వం. కొత సభ్యులను చేర్చుకుంటారని ఎవరి వద్ద డబ్బులు వసూలు చేయలేదు.



# వర్షాలే వర్షాలు.. ఆ జిల్లాలకు అలర్ట్..

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడి.. బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటింది. ఇది రానున్న 12 గంటల్లో మరింత బలహీన పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలు చోట్ల పిడుగులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారినందున కోస్తా ప్రాంతంలోని మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లరాదని ప్రభుత్వం హెచ్చరించింది. ఇక వాయుగుండం, నైరుతి రుతుపవనాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల్లో వర్షాలు కురుస్తాయిని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. కోస్తాంధ్రలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు.. రాయలసీమలో నంద్యాల, వైఎస్ఆర్ కడప, తిరుపతి జిల్లాల్లో తెలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. అలాగే మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది. ఇక తెలంగాణలో వచ్చే నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో జూన్ 2వ తేదీ వరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించినట్లు పేర్కొంది. గురువారం కొత్తగూడెం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవగా.. మహబూబాబాద్, సిరిసిల్ల, ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జనగాం, కామారెడ్డి, ఖమ్మం, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లో నిన్న సాయంత్రం కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు జలమయమైనాయి. అసలు అయితే మే చివరి వారం రోహిణి కార్తీ. దీంతో బాగా ఎండలు కాయాల్సి ఉంది. కానీ నైరుతి రుతుపవనాలు ముందే వచ్చేశాయి. దీంతో తెలుగు రాష్ట్రాల్లో మే చివరి మాసంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

# పారిశ్రామికవేత్తల ద్వారానే సంపద సృష్టి సాధ్యం: సీఎం చంద్రబాబు



దిల్లీ: సంపద సృష్టి జరగకపోతే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేమని.. సంపద సృష్టి పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలు, ఏపీలో అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను వివరించారు. సంపద సృష్టిలో ఏపీకి పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరారు. పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చేశాయన్నారు. 1990లో ఇంటర్‌నెట్ విప్లవం వచ్చిందని, దాన్ని ముందుగా అందుకున్న వాళ్లలో తానూ ఒకడినని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌కు జనాభా అనుకూలత ఉందన్న చంద్రబాబు.. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను భారత్ సరిగ్గా ఉపయోగించుకోవాలన్నారు.

**మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం..** "ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాలు, సెన్సార్లు, ఐఓటీలు.. ఇలా చాలా టెక్నాలజీ వచ్చింది. ఇప్పుడు సమాజానికి కావాల్సింది పారిశ్రామికవేత్తలే. నేను నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఉన్నా.. చాలా మంది నాయకులను చూశాను. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ప్రధానిగా ఉన్నారు. మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నాను.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నాను. విశాఖలో టీసీఎస్ మొదలవుతోంది.. ఆర్సెల్లార్ మిట్టల్ పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. విశాఖకు గూగుల్ రాబోతోంది. ఏపీలో గ్రీన్ ఎనర్జీకి మంచి అవకాశాలు ఉన్నాయి. సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ.. అన్నింటిలోనూ ఏపీ ముందు వరుసలో ఉంది. గ్రీన్ ఎనర్జీ కోసం ఎన్నో కంపెనీలు చాలా ఆసక్తిగా ఉన్నాయి. ఏడాదిలో రూ.5లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు అందుకున్నాం. ఈ ప్రాజెక్టుల ద్వారా నాలుగున్నర లక్షల ఉద్యోగాలు వస్తాయి. మైనింగ్, టూరిజంలోనూ ఏపీలో మంచి అవకాశాలు ఉన్నాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటవుతోంది. 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తాం.

ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలన్నదే నా లక్ష్యం. గతంలో ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు వరుసగా 7-8 ఏళ్లు సీఐఐ సదస్సులు నిర్వహించాం. మొదటి నుంచి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ వచ్చాను" అని చంద్రబాబు వివరించారు.

# 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల స్టేట్‌గా ఏపీ.. ఇదే మా లక్ష్యం




విజయవాడ, మే 30: తాను కూడా చార్టేడ్ అకౌంటెంట్ కావాలనుకుని ఆర్టికల్స్ కూడా చేశానని.. చివరకు పొలిటీషియన్ అయ్యానని అన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. ఈరోజు (శనివారం) ఐసీఏఐ జాతీయ విద్యార్థుల సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. కొన్ని లెక్కలకు సంబంధించి ఆరు సంవత్సరాల తరువాత ఆడిటింగ్ చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ లెక్కలు ఇంకా ఆలస్యం కావడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. భారతదేశంలో ఏ రాజకీయ నాయకుడుకైనా చార్టేడ్ అకౌంటెంట్ లేదా లాయర్ సహాయం తప్పనిసరని అన్నారు. వ్యవసాయాదారిత దేశం టెక్నాలజీ ఆదారిత ఆర్థిక వ్యవస్థగా మారుతోందన్నారు. కొనుగోలు శక్తిలో మనదేశం జపాన్‌ను దాటేసిందని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి త్వరలో అంతర్జాతీయ కంపెనీలు, గ్లోబల్ చైన్లు రాబోతున్నాయన్నారు. 'వాటికి మీ అవసరం ఉంది, ఈ ఏడాది చివరకు భారతదేశం నాలుగు ట్రిలియన్ డాలర్ల ఏకనామిగా మారుతుంది' అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 2.4 ట్రిలియన్ డాలర్ల స్టేట్‌గా 2047 నాటికి ఏపీ లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. వాట్సాప్ ద్వారా పంట కొనుగోలుకు అవకాశం ఇస్తే 74 వేల మంది రిజిస్ట్రార్ అయి 18 వేల మంది తమ పంటను పూర్తి స్థాయిలో టెక్నాలజీని వాడుకుని అమ్మారన్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ గేమ్ చేంజర్ అవుతుందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు త్వరలోనే అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. రైతులు అమ్మిన ధాన్యం బస్తాలకు క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పీ4లో ప్రజలను కూడా భాగస్వామ్యం చేయడానికి కారణం వారు కూడా ఈ దేశాభివృద్ధిలో తమ వంతు ప్రయత్నం చేస్తుండడమే అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# పులివెందులలో తెదేపా ఫ్లెక్సీలు చించివేత.. ఎంపీ అవినాష్ పీఏ సహా 15 మందిపై కేసు

పులివెందులలో మహానాడు టీడీపీ తోరణాలను తొలగించిన వైసీపీ శ్రేణులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వరప్రసాద్‌లతోపాటు మొత్తం 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 191,2. 191,3.324,4.109 రెడ్ విత్ 190 బీఎంఎస్ సెక్షన్ల కింద పులివెందుల పోలీసులు కేసులు నమోదు చేశారు.

**బీటెక్ రవి సంచలన వ్యాఖ్యలు...** ఈ సందర్భంగా పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి శుక్రవారం పులివెందులలో మీడియాతో మాట్లాడారు. పులివెందుల రింగురోడ్డు చుట్టూ వైఎస్ఆర్ విగ్రహాలు అమర్చారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే మహానాడు సందర్భంగా తాము ఎక్కడ కూడా వైఎస్ఆర్ విగ్రహాలకు తగిలే విధంగా తోరణాలు కట్టలేదని స్పష్టం చేశారు. టీడీపీ తోరణాలు తొలగించిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

**నిజమైన వైఎస్సార్ అభిమానులు ఒక్కసారి ఆలోచించాలి..** నిజమైన వైఎస్సార్ భిమానులు ఒక్కసారి ఆలోచించాలని, వైఎస్ విజయలక్ష్మిపై కేసు నమోదు చేయించిన వారెవరో ఆలోచించాలని బీటెక్ రవి అన్నారు. న్యాయబద్ధంగా షర్మిల రెడ్డికి రావాల్సిన ఆస్తిని రాకుండా చేసింది ఎవరని ప్రశ్నించారు. రాజశేఖర్ రెడ్డి రాముడైతే.. లక్ష్మణుడులా పనిచేసిన వ్యక్తి వైఎస్ వివేకానంద రెడ్డి అని, అలాంటి వివేకను హత్య చేసిన కేసులో అభియోగాలు ఎవరు ఎదుర్కొంటున్నారని ఆయన




ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని బీటెక్ రవి విమర్శించారు.

**పది రోజుల్లో కడప స్టీల్ ప్లాంట్..** పది రోజుల్లో కడప స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని బీటెక్ రవి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎవరిపైన అయినా కక్ష సాధింపు చర్యలు తాము చేశామని నిరూపించగలరా అని సవాల్ చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేసింది వైసీపీ నాయకులేనని ఆరోపించారు. గతంలో కడప నుంచి వస్తున్న తనను అరెస్ట్ చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పిన వారు మీరు కాదా అని ప్రశ్నించారు. అవినాష్ రెడ్డి తల్లిని సయితం అడ్డుపెట్టుకొని సీబీఐకు దొరకకుండా తప్పించుకున్నారు కదా అని బీటెక్ రవి అన్నారు.



# కెనడాలో భీకర కార్చిచ్చు

కెనడా పశ్చిమాన సస్కెట్చివాన్ ప్రావిన్స్‌లో కార్చిచ్చు వ్యాపించడంతో అత్యవసర పరిస్థితి విధించారు. ఇప్పటికే మాంటోబా ప్రావిన్స్‌లో దీని కారణంగా దాదాపు 17,000 మందిని ఇళ్లు ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాము తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నామని సస్కట్చెవాన్ ప్రావిన్స్ ప్రీమియర్ స్కాట్‌మో పేర్కొన్నారు. విపత్తును ఎదుర్కోవడానికి సిద్ధంగా అన్ని చర్యలూ తీసుకొన్నామన్నారు. ఈ ప్రావిన్స్ నుంచి ఇప్పటికే 4,000 మందిని తరలించారు. 6,69,000 ఎకరాల్లో ఇది వ్యాపించింది. పరిస్థితి ఏమాత్రం అనుకూలంగా లేదని.. రానురాను సంక్లిష్టంగా మారే అవకాశముందని సిబ్బంది చెబుతున్నారు. ఇక బుధవారం మాంటోబా ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితి విధించారు. చిన్నచిన్న ఊళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ ఈ స్థాయి కార్చిచ్చు చూడలేదని అధికారులు అంటున్నారు. ప్రజలను తరలించేందుకు కెనడా వైమానిక దళం రంగంలోకి దిగింది. ఈ ప్రావిన్స్‌లో 1,73,000 ఎకరాలు కాలి బూడిదయ్యాయి. రెండు లేదా మూడు రోజులు వర్షం పడితేగానీ ఈ కార్చిచ్చు అదుపులోకి రాదని భావిస్తున్నారు. ఇక్కడి నుంచి వస్తున్న పొగ.. అమెరికాలోని మిన్నెసోటా, మిషిగాన్ తదితర రాష్ట్రాల వైపు వెళుతోంది. ఈ రెండు ప్రావిన్సుల్లోనే 2025లో 15 లక్షల ఎకరాలు దగ్ధమయ్యాయి. కెనడా సహజ వనరుల విభాగం లెక్కల ప్రకారం మొత్తం 6,000 కార్చిచ్చులు కలిపి 3.7 కోట్ల ఎకరాలను కాల్చేసినట్లు తెలుస్తోంది. కెనడా కార్చిచ్చుల వల్ల అమెరికాలో ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నట్లు ది అమెరికన్ లంగ్ అసోసియేషన్ 2025లో ఇచ్చిన స్టేట్ ఆఫ్ ది ఎయిర్ రిపోర్టు పేర్కొంది.

# బీఎస్ఎఫ్ దెబ్బకు.. పాక్ ఇప్పట్లో కోలుకోవడం కష్టమే!: అమిత్ షా

పాకిస్థాన్ దుశ్చర్యలను దీటుగా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. ఇటీవల చేపట్టిన సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కూల్చివేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ఆయన.. బీఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉందన్నారు. "ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది.

వీటిని మన బీఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చేశాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం.. పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని



కొనియాడారు. భారత సరిహద్దులో ఎటువంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు.

**త్వరలో ప్యాకేజీ..** జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు.

పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన అక్కడి స్థానికులతో మాట్లాడారు.

# తిరుమలలో భద్రత బలోపేతంపై డీజీపీ, తితిదే ఈవో ఉన్నత స్థాయి సమావేశం



తిరుమల: దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తిరుమలలో భద్రత బలోపేతంపై ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, తితిదే ఈవో జె.శ్యామలరావు సమక్షంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో తిరుపతి ఎస్పీ, తితిదే ఇన్‌ఛార్జ్ సీవీఎస్‌వో హర్షవర్ధన్ రాజు భద్రతా అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో తిరుమలకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని తెలిపారు. ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోంగార్డ్స్, సివిల్ పోలీసులు, తితిదే సెక్యూరిటీతోపాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ సెక్యూరిటీ ఏజెన్సీలకు స్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించాలన్నారు. అలిపిరి వద్ద బహుళ స్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలిసి సెన్సార్ ప్లే సిస్టమ్, ఆధునిక భద్రతా పరికరాలు, సైబర్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. తితిదే ఈవో జె. శ్యామలరావు మాట్లాడుతూ.. భద్రతపై అనుబంధ ఏజెన్సీలతో ఒక సమన్వయ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. తిరుమలలో సైబర్ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. విస్తృతస్థాయిలో తిరుమల భద్రతపై సమీక్ష నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీజీ(లా అండ్ ఆర్డర్) సుధాకర్‌రెడ్డి, అడిషనల్ డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్హా, అనంతపురం రేంజ్ డీఐజీ డా.శేముషి, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, తితిదే అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# భారత్‌ను ఆపాలని పాక్ ప్రపంచ దేశాలను వేడుకుంది: రాజ్‌నాథ్ సింగ్

భారత నౌకాదళానికి చెందిన విమాన వాహకనౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ను శుక్రవారం కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అక్కడి అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మన దేశం శక్తిమంతమైన దాడులు చేయడంతో భారత్‌ను ఆపాలని పాకిస్థాన్ ప్రపంచదేశాలను వేడుకుంది. మన నిబంధనల ప్రకారమే సైనిక చర్యలను ఆపేశాం. ఆపరేషన్ సమయంలో నేవీ పాత్ర అద్భుతమైనది. పాక్ గడ్డపై ఉన్న ఉగ్రవాద స్థావరాలను వైమానిక దళం నేలమట్టం చేసింది. అదే సమయంలో మన నావికా దళం సముద్రంలో చూపిన సంసిద్ధత పాక్ నావికాదళాన్ని ఎక్కడికీ కదలనీయకుండా చేసింది. మీ ముందస్తు మోహరింపుతో పాక్ ధైర్యంపై దెబ్బకొట్టారు. మీరు పాక్‌పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదు. మీ సన్నద్ధతే దాయాదికి గట్టి హెచ్చరిక. భారత నావికాదళ శక్తిని, సైనిక చర్యలను, సామర్థ్యాలను చూసి శత్రుదేశం భయాందోళనకు గురైంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని.. ఇచ్చింది విరామమేనని పేర్కొన్నారు. పాక్ మరో తప్పు చేస్తే ఈసారి కోలుకునే అవకాశమే లేకుండా గట్టిగా



ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించి పాక్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే పాక్ ప్రతిస్పందనను నావికాదళం పసిగట్టి.. తమ సంసిద్ధతను గణనీయంగా పెంచడానికి పలు చర్యలు తీసుకుంది. పాక్‌లోని కరాచీ పోర్టు లక్ష్యంగా ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించింది.

# తిరుపతిలో దారుణం.. మురుగుకాలువలో గర్భస్థ శిశువుల మృతదేహాలు



గూడూరు పట్టణం: సభ్యసమాజం తలదించుకునేలా గర్భస్థ శిశువుల మృతదేహాలు మురుగుకాలువలో పడేసిన సంఘటన తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. కాలువలో చెత్త తొలగిస్తుండగా కవల శిశువుల మృతదేహాలను పారిశుద్ధ్య సిబ్బంది, స్థానికులు గుర్తించారు.

దీంతో వారు ఒకటో పట్టణ పోలీసులకి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గర్భస్రావం జరిగి ఎవరైనా తీసుకొని వచ్చి కాలువలో పడేశారా? లేక ప్రేమ పేరుతో మోసపోయి, గర్భం దాల్చిన తర్వాత అబార్షన్ చేయించుకొని పడేశారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

## అందాల రష్మిక.. చీర ఎవరిచ్చారు? పిక్స్ ఎవరు తీశారు?

హీరోయిన్ రష్మిక మందన్న ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ షేర్ చేస్తున్న విషయం తెలిసిందే. రకరకాల ఔట్ ఫిట్స్ లో ఫోటోలు దిగి సందడి చేస్తుంటారు. అటు ట్రెడిషనల్.. ఇటు మోడ్రన్ గా అలరిస్తుంటారు. రీసెంట్ గా ఆనంద్ దేవరకొండ సినిమా లాంచ్ ఈవెంట్ కు పసుపు, ఎరుపు, ఆరెంజ్ కలర్స్ ఉన్న చీరలో అటెండ్ అయ్యారు. ఆ తర్వాత అదే చీరతో దిగిన పిక్స్ ను షేర్ చేశారు రష్మిక. రకరకాల పోజులు ఇచ్చారు. అదే సమయంలో ఆమె ఇచ్చిన క్యాప్షన్ హాట్ టాపిక్ గా మారింది. "ఈ పిక్స్ లో నాకు ఇచ్చినవి, విలువైనవి అన్నీ ఉన్నాయి. ఇష్టమైన 3 రంగుల చీర, అది ఇచ్చిన స్పెషల్ లేడీ, ఫోటో తీసిన వ్యక్తి, ఇష్టమైన ప్లేస్ అన్నీ ఉన్నాయి" అని క్యాప్షన్ ఇచ్చారు. దీంతో ఇంకేముంది.. రష్మిక పిక్స్ తో మరోసారి ఆమె లవ్ మ్యాటర్ పై చర్చ ఊపందుకుంది. ఎందుకంటే విజయ్ దేవరకొండతో ఆమె ప్రేమలో ఉన్నారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పటి వరకు ఇద్దరిలో ఎవరూ దానికి



అంగీకరించలేదు. ఫ్రెండ్స్ అనే చెబుతుంటారు. అయినా అంతా లవర్స్ అని ఫిక్సయ్యారు. అందుకు అనేక కారణాలు ఉన్నాయి. అదే సమయంలో రీసెంట్ గా రష్మిక.. సోఫాపై కూర్చుని పిక్స్ దిగారు. అదే ప్లేస్ లో ఇప్పటికే విజయ్, రష్మిక, దర్శకుడు పరశురామ్ దిగిన పాత పిక్ వైరల్ గా మారింది. దీంతో రష్మిక.. విజయ్ ఇంట్లోనే పిక్స్ తీసుకున్నారని క్లియర్ గా తెలుస్తోంది. అంతే కాదు ఆయనే తీసి ఉంటారని నెటిజన్లు చెబుతున్నారు. ఆ చీర కూడా విజయ్ మదర్ ఇచ్చి ఉంటారని అనుమానపడుతున్నారు. వారిద్దరూ ప్రేమలో ఉండటం నిజమేనని అంటున్నారు. ఇంకెప్పుడూ చెబుతారని క్వశ్చన్ చేస్తున్నారు. ఇప్పటికే లేటైంది.. చెప్పండి అని అడుగుతున్నారు. మొత్తానికి రష్మిక పోస్ట్ చేసిన పిక్స్ అండ్ క్యాప్షన్ మరోసారి లవ్ కహానీ కోసం మాట్లాడేలా చేశాయని చెప్పాలి. కాగా, విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న.. ఫస్ట్ టైమ్ గీతా గోవిందం మూవీలో నటించారు. అప్పట్లో ఆ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. వారిద్దరి మధ్య కెమిస్ట్రీ వర్కౌట్ అయింది. ఆ తర్వాత డియర్ కామ్రేడ్ మూవీ కోసం మరోసారి జతకట్టారు. అలా వారి కాంబినేషన్ కు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉంది. వారంతా రీల్ కపుల్.. రియల్ కపుల్ గా మారాలని కోరుకుంటున్నారు. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

## మైండ్ బ్లాక్ చేసిన ప్రగ్య బ్యాక్ లెస్ ఫోజ్

సౌత్‌లో పాపులరై, బాలీవుడ్ ని ఏలాలని కలలు గంది ప్రగ్య జైశ్వాల్. ఈ బ్యూటీ ఇటీవల కొంతకాలంగా ముంబైలో సెటిలైంది. అక్కడ తన స్నేహితురాళ్లు మంచు లక్ష్మీ ప్రసన్న, రకుల్ ప్రీత్ లతో కలిసి కెరీర్ వేటలో బిజీ బిజీగా ఉంది. ఇదే సమయంలో హైదరాబాద్ కనెక్షన్స్ ని ప్రగ్య విడిచిపెట్టడం లేదు. తెలుగు పరిశ్రమలో అంది వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. నటిగా తనను తాను నిరూపించుకునేందుకు ఈ భామ ఇప్పటికే చాలా దూరం ప్రయాణించింది. పోరాటం సాగించింది. దశాబ్ధ కాలంగా అనుకున్నది సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. టాలీవుడ్ లో తనదైన ముద్ర వేయాలని తపించిన ఈ భామ కొన్ని అరుదైన అవకాశాలను అందుకుంది. ఆరంభం కంచెలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రను అందుకుంది. వరుణ్ తేజ్ డెబ్యూ మూవీకి ప్రగ్య ప్రధాన ఆకర్షణగా మారింది. కానీ ఆ తర్వాత దానిని మరో స్థాయికి తీసుకెళ్లాల్సి ఉండగా, అగ్ర హీరోల సినిమాల్లో గ్లామరస్ పాత్రలకు పరిమితమైంది.



ఎన్బీకే సరసన అఖండ, డాకు మహారాజ్ లాంటి భారీ చిత్రాలలో నటించిన ప్రగ్య జైశ్వాల్, సల్మాన్ తో కిసీ కా భాయ్... లాంటి పరిధి తక్కువ ఉన్న పాత్రల్లో మెరిసింది. బాలయ్యతో రెండు సినిమాలు కమర్షియల్ విజయాలు అందుకున్నా బోల్డ్ పెర్ఫామర్ గా తన గుర్తింపును పరిమితం చేసాయి. తన ఎంపికల గురించి నిజాయితీగా అంగీకరించే ప్రగ్య జైశ్వాల్ తదుపరి మరో పెద్ద అవకాశం కోసం ప్రయత్నిస్తోంది. ఈ గ్యాప్ లో అభిమానులకు సోషల్ మీడియాల ద్వారా టచ్ లో ఉంది. ప్రగ్య నిరంతర బోల్డ్ ఫోటోషూట్లు ఇన్ స్టాలో వైరల్ గా దూసుకెళుతున్నాయి. తాజాగా ఈ భామ బ్యాక్ లెస్ ఫోజ్ లో చెలరేగిపోయిన ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ప్రగ్య ఖరీదైన బ్లేజర్ ధరించి, తనదైన స్టైల్ లో వీపందం ప్రదర్శించింది. చూపులు తిప్పుకోనివ్వని ఈ లుక్ కుర్రకారు గుండెల్ని మరిగిస్తోంది. అఖండ 2 , టైసన్ నాయుడు లాంటి భారీ చిత్రాల్లో ప్రగ్య నటిస్తోంది.




## ట్రైలర్ టాక్: ఆడపిల్లలను మింగేసే మర్రిచెట్టు రహస్యాలు




ఇటీవలి కాలంలో హారర్ కథల్ని వర్కవుట్ చేయడంలో చాలా మంది దర్శకులు సక్సెసవుతున్నారు. కాంచన ఫ్రాంఛైజీతో రాఘవ లారెన్స్ పెద్ద సక్సెసయ్యాడు. అటు స్త్రీ ఫ్రాంఛైజీని విజయవంతంగా నడిపిస్తూ మడాక్ ఫిలింస్ కూడా వందల కోట్లు ఆర్జిస్తోంది. కేవలం హారర్ లో థ్రిల్లిచ్చే కంటెంట్ ని అందించడంలో ప్రతిభతో ఇది సాధ్యమవుతోంది. ఇంతకుముందు అజయ్ దేవగన్, మాధవన్ షైతాన్ లాంటి థ్రిల్లింగ్ చిత్రంలో నటించగా అది బ్లాక్ బస్టర్ విజయం సాధించింది. భూత ప్రేతాలు, ఆత్మల కారణంగా, మంత్ర తంత్రాల ప్రపంచంలో తన కూతురి కష్టం చూసి చలించిపోయేవాడిగా దేవగన్ నటించాడు. ఇప్పుడు అతడి సతీమణి కాజోల్ ఇదే తరహాలో తన కుమార్తె కష్టం చూడలేని మాంత్రిక ప్రపంచంలో రాక్షస ప్రేతాల కథలో కనిపించింది.

చందన్ పూర్ గ్రామానికి సమీపంలో జరిగిన కథగా దీనిని చూపించారు. భయానక మర్రిచెట్టు ఎందరో ఆడపిల్లలను సంహరించిన ఘటన వెనక మిస్టరీ ఏమిటన్నది ఉత్కంఠను పెంచింది. ఎకరాల కొద్దీ విస్తీర్ణంలో విస్తరించిన పెద్ద మర్రిచెట్టు, ఆ చెట్టు తొర్ర, మర్రిచెట్టు ఊడల భయానక రాక్షస విన్యాసాలను తాజాగా రిలీజైన %-%మా%-% ట్రైలర్ లో చూపించారు. కార్ లో తన కుమార్తెతో కలిసి దట్టమైన కీకారణ్యంలో వెళుతున్న కాజోల్ జీవితంలో ఎలాంటి పెను మార్పులు సంభవించాయి? తన కూతురికి ఏమైంది? అసలు ఆ అరణ్యంలో ఆ మర్రిచెట్టు కథేమిటి? దానివెనక దెయ్యాలు, భూతాలు, ప్రేతాత్మలు, రాక్షసుల కథేమిటన్నదే ఈ సినిమా. మర్డర్ మిస్టరీతో ముడిపడిన, క్రైమ్ థ్రిల్లర్ జానర్ కి హారర్ టచ్ ఇచ్చి తెరకెక్కించారని అర్థమవుతోంది. ట్రైలర్ ఆద్యంతం దడ పుట్టించే విజువల్స్ తో అద్భుతంగా కనిపిస్తోంది. గూస్ బంప్స్ తెప్పించే సీన్స్ ఇందులో ఉన్నాయని కూడా ట్రైలర్ క్లారిటీ ఇచ్చేసింది. ట్రైలర్ నిజంగా బాగుంది .. ఇది 100శాతం ఒరిజినల్‌గా కనిపిస్తోంది కాబట్టి, ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుంది. బాలీవుడ్ కొత్త విషయాలను ప్రయత్నిస్తున్నందుకు సంతోషంగా ఉందని నెటిజనులు స్పందిస్తున్నారు. మా చిత్రంలో ఇంద్రనీల్ సేన్‌గుప్తా, ఖేరిన్ శర్మ, రోనిత్ రాయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జియో స్టూడియోస్, దేవ్‌గన్ ఫిల్మ్స్ మద్దతుతో దీనిని అజయ్ దేవ్‌గన్, జ్యోతి దేశ్‌పాండే నిర్మించారు. కుమార్ మంగత్ పాఠక్ సహ నిర్మాతగా ఉన్నారు. ఈ చిత్రానికి హర్ష్ ఉపాధ్యాయ్, రాకీ ఖన్నా, శివ్ మల్హోత్రా సంగీతం సమకూర్చారు.

## 'సలార్' మళ్లీ నెం.1... ఇదే సాక్ష్యం



ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన 'సలార్' సినిమా 2023 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కేజీఎఫ్ సినిమా సూపర్ హిట్ నేపథ్యంలో సలార్ సినిమాపై మొదటి నుంచి అంచనాలు భారీగా పెరిగాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సలార్ సినిమాను భారీ యాక్షన్ సన్నివేశాలతో ప్రశాంత్ నీల్ రూపొందించాడు. ప్రభాస్ ఫ్యాన్స్ మాత్రమే కాకుండా అన్ని భాషల్లోనూ యాక్షన్ సినిమాలను ఇష్టపడే వారు ఈ సినిమాను తెగ ఆధరించారు. దాంతో థియేట్రికల్ రిలీజ్ అయ్యి దాదాపుగా వెయ్యి కోట్ల వసూళ్లు రాబట్టగా, ఓటీటీ స్ట్రీమింగ్‌లో ఎన్నో రికార్డ్‌లను ఈ సినిమా దక్కించుకుని అరుదైన సినిమాగా నిలిచింది. సాధారణంగా అన్ని సినిమాలు ఒకటి లేదా రెండు ఓటీటీల్లో మాత్రమే స్ట్రీమింగ్ అవుతూ ఉంటాయి. కానీ ఈ సినిమా ఏకంగా ఏడు ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లో స్ట్రీమింగ్ అయింది. థియేట్రికల్ రిలీజ్ అయిన నెల రోజుల తర్వాత ఓటీటీ స్ట్రీమింగ్ మొదలు పెట్టిన సలార్ అన్ని భాషల్లోనూ విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ మధ్య కాలంలో ఓటీటీ ప్లాట్ ఫామ్స్ ఎక్కువగా ఆన్‌డ్రాయిడ్ టీవీల్లో వాడుతూ ఉన్నారు. మొబైల్‌లో ఓటీటీలను వినియోగించడం కాస్త తక్కువే అని చెప్పాలి. అయితే సలార్ సినిమా మొబైల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో అత్యధికంగా చూడబడిన సినిమాగా నిలిచింది అంటూ నిల్సన్ అనే సంస్థ సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, జియో హాట్ స్టార్, సోనీ లివ్, జీ5, ఎంఎక్స్ ప్లేయర్ ఇలా పలు భాషల్లో వివిధ భాషల్లో సలార్ అందుబాటులో ఉంది. లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణాల్లో 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్కులు మొబైల్ ద్వారా సలార్ సినిమాను చూసినట్లుగా నిల్సన్ సర్వేలో వెల్లడి అయింది. మొబైల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ ల్లో ఎక్కువగా వెబ్ సిరీస్‌లను చూస్తూ ఉంటారని, ఆ తర్వాత ఇంగ్లీష్ వెబ్ సిరీస్‌లను చూస్తూ ఉంటారు. కానీ మార్చి 2025 లెక్కల ప్రకారం సలార్ సినిమాను మొబైల్ స్క్రీన్ పై అత్యధికులు చూశారని వెల్లడి అయింది. ప్రభాస్ అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రముఖంగా షేర్ చేస్తూ సందడి చేస్తున్నారు. సలార్ సినిమా పార్ట్ 1 లో మిగిలి ఉన్న ప్రశ్నలకు పార్ట్ 2 లో సమాధానం చెప్పాల్సి ఉంది. ఎన్నో ప్రశ్నాలకు ప్రశాంత్ నీల్ సలార్ 2 లో సమాధానం ఇస్తాడని అభిమానులు, సినీ ప్రేమికులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్ సినిమాతో బిజీగా ఉన్నాడు. దాంతో ప్రభాస్, ప్రశాంత్ నీల్ కాంబో 'సలార్ 2' ఎప్పుడు మళ్లీ సెట్స్ పైకి వెళ్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మెజార్టీ పార్ట్ షూటింగ్ పూర్తి చేసి ఉంటాడని కొందరు అంటూ ఉంటే, సలార్ 2 సినిమా షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదని కొందరు అంటున్నారు. మొత్తానికి సలార్ విడుదలై దాదాపు రెండేళ్లు కావస్తున్నా వార్తల్లో నిలుస్తూనే ఉంది.

## బేబమ్మ బోల్డ్ టాక్స్.. ఐనా కానీ..!

ఉప్పెన తో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న కృతి శెట్టి తొలి సినిమాతోనే యూత్ ఆడియన్స్ లో ఒక మంచి పాపులారిటీ సంపాదించింది. ఐతే ఆ సినిమా తో వచ్చిన క్రేజ్ కొన్నాళ్లే ఉండగా ఆ తర్వాత ఒకటి రెండు సినిమాలు తప్ప తర్వాత అన్నీ కూడా నిరాశపరిచాయి. కృతి శెట్టి చేసిన సినిమాలన్నీ కూడా ఫ్లాప్ అవ్వడంతో ఆమెకు అవకాశాలు కూడా సన్నగిల్లాయి. తెలుగులో చివరగ మనమే సినిమా చేసింది బేబమ్మ. ఆ తర్వాత ఒక్క ఛాన్స్ కూడా రాలేదు. మరోపక్క తమిళ్ లో అమ్మడు ఎల్.ఐ.కె, జినీ సినిమాలు చేస్తుంది. ఆ రెండిటి మీదే అంచనాలను పెట్టుకుంది. ఈమధ్యలో మలయాళంలో కూడా ఒక సినిమా ట్రైల్ వేసిన అమ్మడు అక్కడ పర్వాలేదు అనిపించుకున్నా నెక్స్ట్ ఛాన్స్ లు మాత్రం రాలేదు. అందుకే కలిసి వచ్చిన టాలీవుడ్ మీదే ఇంకాస్త ఫోకస్ పెట్టాలని అనుకుంటుంది కృతి శెట్టి. ఐతే ఇన్నాళ్లు గ్లామర్ షో విషయంలో కాస్త మొహమాటం




చూపించిన అమ్మడు ఇక మీదట గ్లామర్ గేట్లు ఎత్తేయాలని ఫిక్స్ అయ్యింది. అంతేకాదు ఏదైనా బోల్డ్ సబ్జెక్ట్ ఉన్నా కూడా చేయాలని చూస్తుందట. యూత్ ఆడియన్స్ కి ఈమధ్య కాస్త బోల్డ్ రోల్స్ చేసిన హీరోయిన్స్ ని ఎక్కువ ఇష్టపడుతున్నారు. ఐతే కెరీర్ లో ఇప్పటివరకు కృతి శెట్టి గ్లామర్ రోల్స్ చేసింది లేదు. ఆమెకు వచ్చిన అవకాశాలను చేస్తూ కెరీర్ వెళ్లదీసింది. ఐతే గేర్ మార్చి అమ్మడు గ్లామర్ రోల్స్ బోల్డ్ అటెంప్ట్ చేయాలని ఫిక్స్ అయ్యింది.

అలా చేస్తేనన్నా ఆడియన్స్ లో తను ఒక ఇంపాక్ట్ క్రియేట్ చేయగలనని అనుకుంటుంది అమ్మడు. కృతి శెట్టి యాక్టింగ్ పరంగా పర్వాలేదనిపిస్తున్నా ఇక మీదట దానికి తోడు గ్లామర్ షో కూడా తోడైతే కెరీర్ ఇంకాస్త బెటర్ గా ఉంటుందని భావిస్తుంది. ఐతే బేబమ్మ నిర్ణయం వల్ల నిజంగానే ఆమె కెరీర్ ఊపందుకుంటుందా లేదా అన్నది చూడాలి. క్లాస్ లుక్స్ తో కుర్రాళ్లను మెప్పించిన కృతి శెట్టి ఇక మీదట గ్లామర్ డోస్ పెంచి అదరగొట్టాలని చూస్తుంది. మరి అమ్మడి ప్రయత్నాలు ఎంతవరకు వర్క్ అవుట్ అవుతాయో చూడాలి.

## బిగువుల ప్రదర్శన సరే వ్వాట్ నెక్స్ట్ రాశీ?

నేటి జనరేషన్ స్టార్స్ లో తెలివైన ఎంపికలతో కెరీర్ బండిని నడిపిస్తున్న భామగా రాశీ ఖన్నాకు గుర్తింపు ఉంది. టాలీవుడ్ లో యంగ్ హీరోల సరసన నటిస్తూనే, దర్శకద్వయం రాజ్ అండ్ డీకే ప్రాజెక్ట్ ఫర్జీలో నటించింది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో ఈ బ్యూటీ పాన్ ఇండియాలో అభిమానులను ఫిదా చేసింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ హిందీ చిత్రాల్లో నటించేందుకు ప్రణాళికల్ని సిద్ధం చేసింది. ఆరణ్మనై 4 తో కమర్షియల్ విజయం అందుకుంది. ది సబర్మతి రిపోర్ట్, సర్దార్ లాంటి సినిమాలు తనకు నటిగా మంచి పేరు తెచ్చాయి. తెలుసు కదా! అనే తెలుగు చిత్రంలోను ఈ బ్యూటీ



నటిస్తోంది. అటు బాలీవుడ్ లో ఇంకా టైటిల్ నిర్ణయించని ఎ క్రేజీ మూవీలో నటిస్తోంది. కెరీర్ మ్యాటర్ ఇలా ఉండగానే, రాశీ యూత్ లో తన ఫాలోయింగ్ ఎంతమాత్రం తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. ప్రస్తుత కాంపిటీషన్ లో తనను తాను నిలబెట్టుకునేందుకు వరుస ఫోటోషూట్లతో ఫ్యాన్ డమ్ కి టచ్ లో ఉంది. రాశీ తాజాగా తన ఫిట్నెస్ గురూ కుల్ దీప్‌తో కలిసి జిమ్ లో శ్రమిస్తున్న కొన్ని ఫోటోలను షేర్ చేసింది. రాశీ పర్ఫెక్ట్ ఫిట్ టోన్డ్ బాడీని హైలైట్ చేస్తూ ఈ ఫోటో షూట్ గుబులు పుట్టిస్తోంది. బ్లాక్ అండ్ బ్లాక్ - ఆల్ బ్లాక్ ట్రాక్ లో ఉన్న ఈ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో తుఫాన్ సృష్టిస్తున్నాయి. రాశీ నడుము నెమ్మదిగా జీరో నుంచి మైనస్ సైజ్ కి తగ్గిపోవడం ఖాయమని ఈ హార్డ్ వర్క్ చెబుతోంది. కొంత కఠినమైన వ్యాయామ సెషన్స్ కి రాశీ ఖన్నా అటెండవుతోంది. నేను ఏడవకుండా ఆ సెషన్‌లో బయట పడ్డాను. సెల్ఫీలు తీసుకునేంత అందంగా అనిపించింది! అంటూ కొంటె ఫన్నీ ఈమోజీని రాశీ షేర్ చేసింది. రాశీని షేపప్ చేసేందుకు కోచ్ కుల్ దీప్ సేథి చాలా శ్రమిస్తున్నారనడానికి ఈ ఫోటోలే ప్రూఫ్.




## మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి.. మమ్మల్ని లాగొద్దు: కవిత వ్యాఖ్యలపై రఘునందన్

హైదరాబాద్: భాజపా ఎదుగుదలను ఆపాలని కుట్రలు పన్నుతున్నారని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. "చిట్‌చాట్‌లు ఎందుకు?.. ధైర్యముంటే ప్రెస్‌మీట్‌లు పెట్టండి. తప్పుడు వార్తలు రాయిస్తున్నారని చెప్పడం ఎందుకు? భారాసతో మా పార్టీ అధిష్ఠానం ఎప్పుడూ మాట్లాడలేదు. లేనిపోని పంచాయితీలు ఎందుకు?.. కుండ బద్దలు కొట్టినట్లు చెప్పండి. చిట్‌చాట్‌ల పేరుతో మా పార్టీని వివాదంలోకి లాగొద్దని కవితకు విజ్ఞప్తి చేస్తున్నా. మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి.. మమ్మల్ని లాగొద్దు. తెరాస (ప్రస్తుతం భారాస) గతంలో అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2004లో కాంగ్రెస్‌తో తెరాస పొత్తు పెట్టుకుంది. 2009లో మహా కూటమి పేరుతో పలు పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2014లో పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామన్నది ఎవరు? భారాసతో భాజపా ఎప్పుడైనా పొత్తు పెట్టుకుందా? రాష్ట్రంలో భాజపా బలం పుంజుకుంటోంది.. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది. పార్లమెంటు ఎన్నికల్లో భారాస ఒక్క సీటూ గెలవలేదు. ఆ పార్టీ చెల్లని రూపాయిగా మారిందని ప్రజలు భావిస్తున్నారు. భాజపా, భారాస ఒక్కటనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత చెల్లని రూపాయి అయ్యారు. పదేళ్ల పాలనలో అమరుడు శ్రీకాంత్‌చారి కుటుంబానికి ఏమీ దక్కలేదు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన 1200 మంది అమరులను పట్టించుకోలేదు. కేసీఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుంది. హరీశ్‌రావు భాజపా కోవర్టు అయితే మంత్రివర్గం నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదు? భారాస బలహీనపడాలి అనుకునేవాళ్లే కవిత వెనక ఉన్నారు. ఆమె కొత్త పార్టీ పెడుతోందని నాకు సమాచారముంది. భారాసకు అభ్యర్థులు లేక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కోవర్టు పని చేసే వాళ్లు భాజపాలో ఉండరు" రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు.




## ఒకే సినిమాకు రెండు రాష్ట్రాల్లో అవార్డులు ఇస్తే బాగోదు: మురళీమోహన్

హైదరాబాద్: ఏపీలోనూ సినీ అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ప్రముఖ సినీనటుడు మురళీమోహన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించే గద్దర్ అవార్డుల ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒకే తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అవార్డులు ఇవ్వడం బాగుండదన్నారు. దీనిపై రెండు ప్రభుత్వాలు ఒక అవగాహనకు రావాలని.. ఒక ఏడాది తెలంగాణ, మరో ఏడాది ఏపీ ప్రభుత్వాలు పురస్కారాలను ప్రకటించాలని సూచించారు. "తెలంగాణలో ఈ సినిమాకు.. ఆంధ్రాలో ఆ సినిమాకు అవార్డు ఇచ్చారనేది వివాదానికి దారితీస్తుంది. తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలూ కావాలి. ఒక రాష్ట్రం ఎక్కువ.. మరో రాష్ట్రం తక్కువ కాదు. సినిమాకు సంబంధించి తెలుగు ప్రేక్షకులంతా ఒకటే.

మన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శితమవుతున్నాయి. తెలుగు సినిమాలను మనకంటే ముందు అమెరికా వాళ్లు చూస్తున్నారు" అని మురళీమోహన్ అన్నారు.

## వాస్తవాల ప్రాతిపదికన పథకాలు తీసుకొస్తాం: మంత్రి సీతక్క



హైదరాబాద్, మే 30: తెలంగాణలో విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, నేర్చుకునే సామర్థ్యం, పని, కుటుంబ పరిస్థితులపై సెస్ సర్వే చేయడం అభినందనీయమని పంచాయితీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈరోజు (శనివారం) బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ ప్రాంగణంలో యంగ్ లైవ్స్ రౌండ్ - 7 సర్వే నివేదికను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సర్వే నివేదికలు విధాన రూపకల్పనలో ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనాల వల్ల ప్రభుత్వ విధానాల్లో ఏవైనా లోటు పాట్లు ఉంటే సవరించుకోవచ్చని చెప్పారు. తెలంగాణలో విద్య, వైద్యం, పౌష్టికాహారం కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పాఠశాలల్లో ప్రభుత్వ హాస్టల్లలో మెరుగైన విద్యతో పాటు, మెరుగైన భోజన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. సరైన పౌష్టికాహారం లేకపోతే విద్యార్థులు విద్య మీద దృష్టి సారించలేకపోతున్నారని అన్నారు. ఒక ఆదివాసి బిడ్డగా తనకు ఆకలి బాధ తెలుసన్నారు. అందుకే ఎక్కడ ఫుడ్ గ్యాప్స్ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అమ్మాయిల్లో రక్తహీనతను నివారించేందుకు పోషకాలతో కూడిన చిక్కిల పంపిణీ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. సెస్ నిర్వహిస్తున్న సర్వేలకు, అధ్యయనాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు.

సెస్ ఇచ్చే వాస్తవాల ప్రాతిపదికన ప్రజా సంక్షేమం కోసం మరిన్ని పథకాలు తీసుకొస్తామన్నారు. సర్వేలు కేవలం సర్వేల కోసమే జరగకూడదని.. ప్రజల సమస్యలు, అభివృద్ధి ఆకాంక్షలు, విధానపరమైన లోటు పాట్లు తెలిపేలా సర్వేలు జరగాలని అన్నారు. వాస్తవాల ప్రాతిపదికన రూపొందించిన సర్వేలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి పథకాలను రూపొందిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

**మంత్రి ఔదార్యం...** ఫిట్స్‌తో బాధపడుతున్న వ్యక్తి పట్ల మంత్రి సీతక్క మానవత్వాన్ని చూపారు. పంజాగుట్ట ఫ్లైఓవర్‌పై ఓ వాహనదారుడికి ఫిట్స్ వచ్చాయి. ఆ మార్గంలో వెళ్తున్న మంత్రి సీతక్క.. తక్షణమే స్పందించారు. తన వాహనాన్ని ఆపి అతని చేతిలో తాళం చెవులు పెట్టారు. అతను కోలుకునేదాకా మంత్రి సహాయపడ్డారు. అతను కుదుటపడే వరకు అక్కడే ఉండి ధైర్యం చెప్పి ఆ తరువాత సదరు వ్యక్తిని ఆస్పత్రికి పంపించారు. మంత్రి సీతక్క ఔదార్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ హ్యాట్సాఫ్ చెబుతున్నారు.




## కొత్తగూడెంలో 17 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం నేరవిభాగం: కొత్తగూడెంలో 17 మంది మావోయిస్టు సభ్యులు జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారుల సమక్షంలో లొంగిపోయారు.

ఈ సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడారు. లొంగిపోయిన వారిలో ఏసీఎం క్యాడర్‌కు చెందిన ఇద్దరు, పార్టీ సభ్యులు నలుగురు, మిలీషియా సభ్యులు 11 మంది ఉన్నట్లు వివరించారు. ఏజెన్సీ ప్రాంత వాసుల్లో మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం సన్నగిల్లిందన్నారు. తెలంగాణలో మావోయిస్టులకు ఆశ్రయం ఉండే పరిస్థితులు లేవని చెప్పారు. విశ్వసనీయ సమాచారంతో ఇటీవల జిల్లాలో 20 మంది సాయుధ దళ సభ్యులను అరెస్టు చేసి 12 ఆయుధాలను జప్తు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 282 మంది మావోయిస్టు దళ సభ్యులు జనజీవన స్రవంతిలో కలిసి తగిన పునరావాస సౌకర్యాలను పొందినట్లు ఎస్పీ వివరించారు.

## పీవోకేను పాకిస్థాన్‌కు ఎవరు ఇచ్చారు?: కిషన్‌రెడ్డి



దిల్లీ: భారత సైన్యం విజయాన్ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తక్కువ చేసి మాట్లాడటం దుర్మార్గమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. సైన్యం విజయాన్ని దేశమంతా పండుగ చేసుకుంటుంటే రేవంత్‌రెడ్డికి అది భాజపా కార్యక్రమంగా కనిపిస్తుందా అని మండిపడ్డారు. "మన ఎంపీలు పార్టీలను పక్కన పెట్టి ప్రపంచమంతా తిరుగుతున్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఎందుకు చేయాల్సి వచ్చిందో ప్రపంచానికి చెబుతున్నారు. అసలు పీవోకేను పాకిస్థాన్‌కు ఎవరు ఇచ్చారు?. కాంగ్రెస్ కారణంగానే పీవోకే అంశం రావణ కాష్టంగా రగులుతూనే ఉంది. ఉగ్రవాదులు దాడి చేస్తే గత కాంగ్రెస్ ప్రభుత్వాల్లాగా సంతాపాలతో సరిపుచ్చుకోలేదు. పాక్ భూభాగంలోకి వెళ్లి మరీ సర్జికల్ స్ట్రైక్ చేసింది మోదీ సర్కారు. పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్‌కు ఎలా నరకం చూపించామో ప్రపంచం చూసింది"అని కిషన్‌రెడ్డి అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నిర్మాత ఎ.ఎం రత్నం



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సినీ నిర్మాత ఎ.ఎం.రత్నం కలిశారు. 'హరిహర వీరమల్లు' చిత్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 17వ శతాబ్దానికి సంబంధించిన కథతో రూపొందిన 'హరిహర వీరమల్లు' గురించి ఆయన సీఎంతో చర్చించారని పేర్కొంది. అలాగే తెలంగాణలో ఈ సినిమా టికెట్ ధరల గురించి కూడా ప్రస్తావించినట్లు తెలిపింది. తన విలువైన సమయాన్ని కేటాయించినందుకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఎ.ఎం రత్నం కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రాబోతున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందిన ఈ చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే.

## ఈటల, హరీశ్‌రావు ఇద్దరూ కలిసి .. కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు: మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్: సర్జికల్ స్ట్రయిక్స్ చేసి గొప్పలు చెప్పుకొంటు న్నారు.. అప్పట్లో ఇందిరా గాంధీ వందల కొద్దీ సర్జికల్ స్ట్రయిక్స్ చేసినా ఏనాడూ చెప్పుకోలేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరాగాంధీ గొప్పతనాన్ని ఆనాడు వాజ్‌పేయీ కూడా గుర్తించి.. అపర కాళీ అని మెచ్చుకున్నారని గుర్తు చేశారు. అసలు ఇందిరాగాంధీకి.. మోదీకి పోలిక ఏంటని ప్రశ్నించారు. "భాజపా, భారాస సయోధ్య గురించి కవిత ఇప్పుడు బయటపెడుతున్నారు. బండి సంజయ్‌ను భాజపా అధ్యక్ష పదవి నుంచి అన్యాయంగా తొలగించలేదా? భారాసతో దోస్తీకి అడ్డుగా ఉన్నందుకే సంజయ్‌ను తొలగించింది వాస్తవం కాదా? భాజపా నేతల ప్యాకేజీల గురించి రాజాసింగే చెబుతున్నారు. రాజాసింగ్ మాటలకు ఆ పార్టీ పెద్దలు సమాధానం చెప్పాలి. షామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఈటల రాజేందర్, హరీశ్‌రావును కలిశారు. ఇద్దరూ కలిసి కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈటల రాజేందర్.. మోదీ పార్టీలో ఉన్నారా? కేసీఆర్ పార్టీలో ఉన్నారా? కాళేశ్వరం స్కామ్ నుంచి బయటపడేందుకు ఈటల.. కేసీఆర్‌తో చేతులు కలుపుతున్నారు" అని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు.

## అన్నింటినీ భరించుకుంటూ వచ్చా.. సిన్సియర్‌గా పనిచేశా.. అయినప్పటికీ




మంచిర్యాల, మే 30: జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన కొనసాగుతోంది. భారీ కాన్వాయ్‌తో శ్రీరాంపూర్ చేరుకున్న కవితకు జాగృతి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కవిత పర్యటనకు బీఆర్ఎస్ నేతలు దూరంగా ఉన్నారు. ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలోకు వచ్చిన ఎమ్మెల్సీ.. పలువురు జాగృతి నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియా నిర్వహించిన చిట్‌చాట్‌లో మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు కవిత. తాను రాసిన లేఖకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదన చెందే లేఖ రాశానని.. పార్టీ బాగు కోసమే లెటర్ రాసినట్లు తెలిపారు. సామాన్య కార్యకర్తలు ఏమి కోరుకుంటున్నారో అదే విషయాన్ని లేఖ ద్వారా పార్టీ చీఫ్ కేసీఆర్‌కు వివరించానని తెలిపారు. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడ్డానని అన్నారు. పదేళ్లుగా ఎంతో ఆవేదనను అనుభవించానని.. అన్నింటినీ భరించుకుంటూ వచ్చానని చెప్పారు. పార్టీలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. పార్టీ అభివృద్ధి కోసం, పార్టీ బలోపేతం కోసం ఎంతగానో కృషి చేశానన్నారు. ఉద్యమం నుంచి మొదలు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కూడా పార్టీ కోసం సిన్సియర్‌గా పనిచేశానని.. అయినప్పటికీ కొన్ని అంశాలు తనను బాధించాయన్నారు. అంతేకాకుండా.. తనను జైలు పాలు చేసిన బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేయాలని చూశారని, బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని అనుకున్నారని చెప్పారు. తాను జైల్లో ఉంటే బీజేపీతో పొత్తు ప్రస్తావన తేవడంతో ఆవేదన చెందానని ఎమ్మెల్సీ అన్నారు. బీజేపీతో కలవడం అనవసరమని.. ఆ పార్టీతో కలిసిన ఏ పార్టీ కూడా బతికి బట్ట కట్టలేదని వ్యాఖ్యలు చేశారు. అందుకోసమే విలీనం వద్దంటూ పార్టీకి లేఖ ద్వారా స్పష్టం చేశానని చెప్పుకొచ్చారు. అధినేతను కలవాలని, చెప్పాలని ప్రయత్నం చేశానని.. తన తండ్రిని కలిసేందుకు అవకాశం వచ్చినా.. లెటర్ లీక్‌తో తాను కలవలేకపోయినట్లు చెప్పారు. గతంలో కూడా లేఖలు రాశానని.. కానీ ఈసారి తనను టార్గెట్ చేస్తూ ఒక పథకం ప్రకారమే లేఖను లీక్ చేశారని మరోసారి చెప్పారు. లెటర్ లీక్ చేసిన వారెవరో తేల్చాలని అన్నారు. తనకంటూ సొంత అజెండా ఏమీ లేదన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి ఒప్పుకోనని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. కాగా.. గత రెండు రోజులుగా కవిత పరిణామాలు, ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరోసారి కవిత తన మనసులో మాటను చిట్‌చాట్ ద్వారా బయటపెట్టారు. దీంతో కవిత ఎపిసోడ్ బీఆర్ఎస్‌లో తీవ్ర సంచలనంగా మారింది.

## ఇందిరమ్మ ఇళ్లకు 2.10లక్షల లబ్ధిదారులు ఎంపిక: పొంగులేటి



హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటి వరకు 2.10లక్షల మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల 10లోగా మిగతా లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టులో 42వేల ఇళ్లు మంజూరు చేయగా.. 24వేలు ప్రారంభమయ్యాయని, సుమారు వంద ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. "లబ్ధిదారుల జాబితాకు సంబంధించి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను 40 శాతం పేర్లు ఇవ్వమన్నాం. మిగతా 60శాతం ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేస్తాయి. కేటీఆర్ జాబితా ఇవ్వలేదు.. అధికారులనే ఎంపిక చేయమన్నారు. ఐటీడీఏ పరిధిలో చెంచులకు 9,200 ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్‌లోని 16 స్లమ్స్‌లో నాలుగంతస్తుల భవనాలు నిర్మిస్తాం. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిర్మిస్తాం"అని మంత్రి తెలిపారు.




పనాజీ: గోవా లో హైదరాబాద్ రౌడీ షీటర్ అల్తాఫ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గోవాలోని కాసినో వద్ద హైదరాబాద్ మైలార్ దేవ్ పల్లికి చెందిన రౌడీ షీటర్ అల్తాఫ్ మద్యం మత్తులో ఇద్దరు సెక్యూరిటీ గార్డులపై దాడి చేశాడు. కాసినో వద్ద వీరంగం సృష్టించటంతో సెక్యూరిటీ గార్డులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారిపై దాడి చేసి హైదరాబాద్ పారిపోయే ప్రయత్నం చేయగా.. గోవా ఎయిర్ పోర్టులో అల్తాఫ్‌ను గోవా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోవా కాసినోలో హైదరాబాద్ రౌడీ షీటర్ హల్ చల్ సృష్టించిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. గొడవలో కాసినో ఈవెంట్ సెక్యూరిటీ గార్డులపై దాడి చేసి పారిపోయి హైదరాబాద్ వస్తుండగా గోవా పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్ మైలార్ దేవ్ పల్లికి చెందిన రౌడీ షీటర్ అల్తాఫ్ మరో ముగ్గురు స్నేహితులతో కలిసి రెండు రోజుల క్రితం గోవా వెళ్లాడు. బుధవారం రాత్రి గోవా పానాజీ క్యాంపుల్ లోని కాసినోకు వెళ్లారు. అక్కడ సెక్యూరిటీ గార్డులుగా ఉన్న ధీరు శర్మ, సత్యం గోంకర్‌లతో గొడవపడ్డాడు. దురుసుగా ప్రవర్తించవద్దని సెక్యూరిటీ గార్డులు కోరినప్పటికీ, అల్తాఫ్ వెనక్కి తగ్గలేదు. వారిపై ఇనుప రాడ్‌తో దాడి చేసాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ధీరు శర్మ మరణించాడు. దీంతో రౌడీ షీటర్ అల్తాఫ్ హైదరాబాద్ పారిపోయేందుకు యత్నించడంతో గోవా పోలీసులు అరెస్టు చేశారు. మరో సెక్యూరిటీ గార్డు సత్యం గోంకర్ గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ కేసును ఎస్పీ రాహుల్ గుప్తా సారధ్యంలో దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేకాట నిషేధం ఉండడంతో హైదరాబాద్‌కు చెందిన రౌడీ షీటర్‌లు గోవాలో పేకాట ఈవెంట్‌లను నిర్వహిస్తూ.. పేకాట రాయుళ్లను అక్కడికి విమానాల్లో తీసుకువెళ్లి కాసినో ఆడిస్తున్నట్లు సమాచారం.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com